



# మన దునియా

RNI Number
TELTEL/2023/85680


మన అక్షరం - మన ప్రపంచం








సంపుటి : 3 | సంచిక : 266 | మే 24 ఆదివారం 2026 | పేజీలు : 8 | వెల రూ. 4.00/-


**మన దునియా, నిజామాబాద్ (మే 23):**

నిజామాబాద్ జిల్లాలో "మన దునియా" జర్నలిస్టు బసవరాజు అరెస్టు వ్యవహారం రోజురోజుకూ కొత్త మలుపులు తిరుగుతోంది. ఆయనను అక్రమంగా అరెస్టు చేశారన్న ఆరోపణల సెగలు ఇంకా చల్లారకముందే, తాజాగా మరో సంచలన విషయం వెలుగులోకి వచ్చింది. పోలీస్ కస్టడీలో తనపై 'థర్డ్ డిగ్రీ' ప్రయోగించారంటూ ములాఖాత్ సందర్భంగా బసవరాజు చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు జిల్లావ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి.

**కస్టడీలో నరకయాతన**

జైలులో ములాఖాత్ సందర్భంగా తనను కలవడానికి వచ్చిన కుటుంబ సభ్యులు, సన్నిహితులతో బసవరాజు తన గోడును వెళ్లబోసుకున్నట్లు సమాచారం. పోలీసుల కస్టడీలో తనను తీవ్ర మానసిక ఒత్తిడికి గురిచేయడమే కాకుండా, శారీరకంగా దారుణంగా హింసించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం బయట ప్రపంచంతో ఎలాంటి సంబంధాలు లేకుండా ఏకాంతంలో ఉంచారని, కన్న తల్లిదండ్రులను కూడా కలవనీయకుండా తీవ్ర ఇబ్బందులకు గురిచేశారని ఆయన వాపోయారు.

**వార్తలు రాస్తే వేధింపులా..? భగ్గుమంటున్న జర్నలిస్టు సంఘాలు**

బసవరాజు తాజా ఆరోపణలతో జిల్లాలోని జర్నలిస్టు సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఒక జర్నలిస్టు

## యాదాద్రిలో 100 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన!

**మన దునియా,హైదరాబాద్:మే 23**

తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి యాదాద్రి జిల్లా పర్యటనలో భాగంగా,ఈరోజు పలు అభివృద్ధి కార్యక్రమా ల్లో పాల్గొనేందుకు వెళ్లారు. ఈ క్రమంలో జిల్లా అధికార యంత్రాంగ వైఫల్యం స్పష్టంగా కనిపించింది, సీఎం రేవంత్ రెడ్డి, హెలికాప్టర్ పెద్దగుట్టపై ల్యాండ్ అయినప్పటికీ అక్కడ ముఖ్యమంత్రి ని రిసీవ్ చేసుకోవడా నికి కనీసం ఏ ఒక్క ఉన్నంత అధికారి అందుబాటులో లేకపోవడం తీవ్ర కలకలం రేపింది.. శనివారం ఉదయం యాదగిరిగుట్టకు చేరుకున్న సీఎం రేవం త్ రెడ్డి, ముందుగా శ్రీ కంచి కామకోటి పీఠాధి పతి విజయేంద్ర స్వా మి సరస్వతి ఆశీస్సు లు తీసుకున్నారు. అనంతరం యాదగిరి గుట్ట



## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం: కేటీఆర్

ఐసీఏఐ స్నాతకోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న కేటీఆర్

చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచన

సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని ఆకాంక్ష



## యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా.. బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

**మన దునియా,హైదరాబాద్,మే 23**

బీఆర్ఎస్ పార్టీ నేతలపై మంత్రి శ్రీధర్ బాబు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు చీప్ పాలిటిక్స్.. బ్లాక్ మెయిల్ పాలిటిక్స్ చేయొద్దని అన్నారు. శనివారం మీడియాతో మాట్లాడుతూ.. ఎక్కడ అభివృద్ధి చేస్తే అక్కడ ఆపుతామంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు కోరుకున్నది తప్పకుండా చేసి తీరుతామన్నారు. వేలాది కోట్లు పెడతామని మల్టీ నేషనల్ కంపెనీలు వస్తున్నాయని.. ఫ్యూచర్ సిటీని రద్దు చేస్తామంటే పెట్టుబడిదారులు భయపడరా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లో కాంగ్రెస్ తెచ్చిన మెట్రోనే ముందుకు సాగిందని



మంత్రి తెలిపారు. తాము ఎన్ని కిలోమీటర్లు తెచ్చామో అన్ని కిలోమీటర్లు మాత్రమే మెట్రో వచ్చిందని చెప్పారు. మెట్రోను విస్తరిద్దామంటే అడ్డుకుంటున్నారని మండిపడ్డారు. పెరిగిన జనాభాకి అనుగుణంగా మెట్రో విస్తరించకూడదా అని ప్రశ్నించారు

(మిగతా 2వ పేజీలో..)

## తెలంగాణలో వడదెబ్బతో 34 మంది మృతి.. రూ.4 లక్షల పరిహారం: మంత్రి పొంగులేటి

**మన దునియా,హైదరాబాద్:మే 23**

తెలంగాణ రోజురోజుకూ నిప్పుల కుంపటిగా మారుతోంది. రికార్డు స్థాయిలో 47 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కాగా.. తీవ్ర భయాందోళనలు నెలకొంటున్నాయి. ఎండ తీవ్రత నేపథ్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఇప్పటికే..రాష్ట్ర ప్రభుత్వం సూచనలు చేసిన సంగతి తెలిసిందే. అత్యవసరం అయితే తప్ప ఉదయం 8.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇళ్ల నుంచి బయటికి రావద్దని సూచించింది. ఇక మధ్యాహ్నం పూట.. ప్రజల కోసం బయట ఏర్పాట్లు చేయాలని అధికారులకు.. సర్కార్ ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలోనే తాజాగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. రాష్ట్రంలో ఎండలు, వడగాలులు, వడదెబ్బ పరిస్థితులపై అత్యవసర సమీక్ష నిర్వహించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో రానున్న

(మిగతా 2వ పేజీలో..)



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## యాదాద్రిలో 100 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం రేవంత్ రెడ్డి శంకుస్థాపన!

(మొదటి పేజీ తరువాయి)

వద్ద రూ.100 కోట్ల వ్యయంతో చేపట్ట నున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. ఆలయ క్షేత్రంలో 15 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న వేద పాఠశాలకు ఆయన భూమి పూజ చేశారు. కంచి కామకోటి పీఠాధిపతి సమక్షంలో ఈ కార్యక్రమం జరగుతోంది. వచ్చే రెండేళ్లలో నిర్మాణం పూర్తిచేసి తరగతులు ప్రారంభించనున్నారు. 9.88 కోట్లతో కొండపై నిత్యకల్యాణం, రంగం మండపం నిర్మాణం, 1.41 కోట్లతో మెట్ల మార్గానికి పైకప్పు, 1.44 కోట్లతో మాడ వీధులకు మెట్లు, 43. 5 కోట్లతో దీక్షాపరుల మండపం పనులకు ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

## యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా.. బీఆర్ఎస్‌పై మంత్రి శ్రీధర్ బాబు ఫైర్

(మొదటి పేజీ తరువాయి)

. మాజీ మంత్రి హరీశ్ రావు పగటి కలలు కంటున్నారని విమర్శించారు. రాష్ట్రం అభివృద్ధి చెందాలా? వద్దా? హరీశ్ రావు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ, పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిందని.. అయినా ఆ పార్టీ నేతల బుద్ధి మారడం లేదని వ్యాఖ్యానించారు.నగరాన్ని విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోందని మంత్రి తెలిపారు. ప్రజల అవసరాలను తీర్చడానికి ప్రణాళికలు రూపొందించామన్నారు. ఇతర నగరాల అభివృద్ధిపై అధ్యయనం చేశామన్నారు. రాబోయే తరాలకు ఉపయోగపడే కార్యాచరణ చేపట్టాలని నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడానికే బీఆర్ఎస్ ప్రయత్నం చేస్తోందని దుయ్యబట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని అడ్డుకోవాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తోందని మంత్రి ఆరోపించారు. ఓటమితో ఎదురైన నిరాశ నుంచి ఇప్పటికీ బయటకి రాలేకపోతున్నారన్నారు. బుల్లెట్ ట్రైన్ తెస్తామంటే.. ఎందుకని బీఆర్ఎస్ నేతలు అడ్డుపడుతున్నారని ఫైర్ అయ్యారు. తెలంగాణ యువతకు మంచి భవిష్యత్తు ఇవ్వొద్దా అని అన్నారు. స్వార్థ రాజకీయాలే తమకి ముఖ్యమని బీఆర్ఎస్ నేతలు భావిస్తున్నారని మంత్రి శ్రీధర్ బాబు విరుచుకుపట్టారు..

## తెలంగాణలో వడదెబ్బతో 34 మంది మృతి.. రూ.4 లక్షల పరిహారం: మంత్రి పొంగులేటి

(మొదటి పేజీ తరువాయి)

3 రోజుల పాటు అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు కానున్న నేపథ్యంలో.. ప్రజలంతా మరింత అలర్ట్‌గా ఉండాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి కీలక సూచనలు చేశారు. పిల్లలు, వృద్ధులు అత్యవసరమైతేనే బయటికి రావాలని తేల్చి చెప్పారు. బస్టాండ్లు, రైల్వేస్టేషన్ల వద్ద ప్రజలకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇక వడదెబ్బతో చనిపోయిన వారి కుటుంబ సభ్యులకు రూ.4 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. గతంలో వడదెబ్బ పరిహారం రూ.50 వేలు ఉండగా.. దాన్ని రూ.4 లక్షలకు పెంచినట్లు గుర్తు చేశారు.ఇక తెలంగాణలో రోజురోజుకు ఎండల తీవ్రత పెరిగిపోతుండగా.. 18కి పైగా జిల్లాల్లో 46 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే 18 జిల్లాలకు వాతావరణ శాఖ అధికారులు రెడ్ అలర్ట్ జారీ చేశారు. మరోవైపు.. హైదరాబాద్ నగరంలోనూ 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా వడగాలులపై హై అలర్ట్ ప్రకటించినట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కలెక్టర్లు ఎప్పటికప్పుడు అలర్ట్‌గా ఉండాలని సూచించారు.రాష్ట్రంలో ఎండల తీవ్రతకు సంబంధించి.. గంట గంటకు ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్లు మంత్రి పొంగులేటి తెలిపారు. గర్భిణులు, వృద్ధులు, చిన్నారులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎవరైనా ఎండదెబ్బకు గురైతే.. వారిని స్థానిక ఆస్పత్రులకు తరలించి.. అత్యవసర చికిత్స అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

## భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో సీఏల పాత్ర కీలకం: కేటీఆర్

భవిష్యత్తులో వ్యాపార అవకాశాల్లో చార్టర్డ్ అకౌంటెంట్ల (సీఏ) పాత్ర అత్యంత కీలకంగా మారుతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. గచ్చిబౌలిలోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ చార్టర్డ్ అకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా (ఐసీఏఐ) స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. కేటీఆర్ మాట్లాడుతూ, చార్టర్డ్ అకౌంటెంట్లు కేవలం పన్నుల లెక్కలకే పరిమితం కాకూడదని సూచించారు.సీఏలు వ్యాపారాలను వృద్ధి చేసే సలహాదారులుగా ఎదగాలని వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాలానుగుణంగా కృత్రిమ మేధ (ఏఐ)ని వృత్తిలో భాగంగా చేసుకోవాలని ఆయన అన్నారు. మున్ముందు పన్నులు, జీఎస్టీ, వ్యాపారాల విస్తరణలో సీఏల అవసరం చాలా ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రుల త్యాగాలను, కష్టాన్ని మరవకూడదని సూచించారు.



# విచారణ పేరుతో.. 'థర్డ్ డిగ్రీ' ట్రీట్మెంటా?

(మొదటి పేజీ తరువాయి)

పట్ల పోలీసుల తీరుపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాయి. "సమాజంలో జరుగుతున్న తప్పులను ఎత్తిచూపుతూ వార్తలు రాస్తే వేధింపులకు గురిచేస్తారా..? ప్రభుత్వ వైఫల్యాలను విమర్శిస్తే అక్రమ కేసులు బనాయిస్తారా..?" అంటూ పలువురు జర్నలిస్టులు మండిపడుతున్నారు. ఇది ముమ్మాటికీ పత్రికా స్వేచ్ఛపై జరుగుతున్న దాడి అని వారు అభివర్ణిస్తున్నారు.

**మానవ హక్కుల ఉల్లంఘనేనా..?**

ఈ మొత్తం వ్యవహారంలో బాహాటంగా మానవ హక్కుల ఉల్లంఘన జరిగిందన్న కోణంలో న్యాయవాదులు, పౌర హక్కుల సంఘాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. పోలీస్ కస్టడీలో జర్నలిస్టుపై థర్డ్ డిగ్రీ ప్రయోగించారన్న ఆరోపణలు నిజమైతే, అది చట్ట వ్యతిరేకమని, చట్టాన్ని చేతిలోకి తీసుకునే హక్కు ఎవరికీ లేదని ఇటు న్యాయవాదులు స్పష్టం చేస్తున్నారు దోషులు ఎవరైనా పర్వాలేదు కఠినంగా శిక్షిస్తామని న్యాయవాదులు పేర్కొంటున్నారు

**విచారణ జరిగేనా..? చర్యలు తీసుకునేనా..?**

బసవరాజు చేసిన ఈ సంచలన ఆరోపణలపై ఉన్నతాధికారులు ఎలా స్పందిస్తారన్నది ఇప్పుడు అత్యంత ఆసక్తికరంగా మారింది. పారదర్శకత కోసం పోలీస్ కస్టడీ వివరాలను, పోలీస్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలను పరిశీలిస్తారా..? చట్టాన్ని అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటారా..? లేక వ్యవహారాన్ని మామూలుగానే ముగించి, కేసును నీరుగార్చే ప్రయత్నం చేస్తారా..? అన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.ఇప్పటికే ఈ ఘటన జిల్లావ్యాప్తంగా సంచలనంగా మారగా; అధికారులు స్పందించి, విచారణ జరిపి, దోషులను కఠినంగా శిక్షించాలని ఇటు ప్రజలు, ప్రతిపక్ష పార్టీలు, జర్నలిస్టు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## మోదీతో మార్కో రూబియో కీలక చర్చలు.. అమెరికా రావాలని ఆహ్వానం

**నాలుగు రోజుల భారత పర్యటనలో రూబియో**

**భద్రత, వాణిజ్యం సహా కీలక రంగాలపై చర్చ**

**యుద్ధం నేపథ్యంలో భేటీకి ప్రాధాన్యం**

నాలుగు రోజుల భారత పర్యటనకు వచ్చిన అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో శనివారం ప్రధాని మోదీతో భేటీ అయ్యారు. వాణిజ్య, భద్రత సహా కీలక రంగాలపై చర్చలు జరిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ట్రంప్ తరఫున మోదీని వైట్‌హౌస్‌కు ఆహ్వానించారు. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక భారత్-అమెరికా మధ్య వాణిజ్యం విషయంలో విభేదాలు తలెత్తిన విషయం తెలిసిందే. మరోవైపు ఇరాన్ ఉద్రిక్తతలు కొనసాగుతున్న తరుణంలో ఈ భేటీ జరగడం ప్రాధాన్యం సంతరించుకుంది.

**అమెరికా రాయబారి ట్వీట్**

ఈ చర్చల్లో పాల్గొన్న అమెరికా రాయబారి సెర్గియో గోర్ భేటీ అనంతరం 'ఎక్స్' వేదికగా స్పందించారు. "ప్రధాని మోదీతో సమావేశం అద్భుతంగా సాగింది. భద్రత, వాణిజ్యం, కీలక సాంకేతిక రంగాల్లో అమెరికా-భారత్ సహకారాన్ని మరింత బలోపేతం చేసే మార్గాలపై ఫలప్రదమైన చర్చలు జరిగాయి. ఈ రంగాలు ఇరు దేశాలను పటిష్ఠం చేయడమే కాకుండా.. స్వేచ్ఛా, బహిరంగ ఇండో-పసిఫిక్ రీజియన్‌ను ముందుకు తీసుకెళతాయి. అమెరికాకు భారత్ అత్యంత కీలకమైన భాగస్వామి" అని పోస్ట్ చేశారు.

**ఇరాన్ వివాదంపై చర్చ?**



ప్రపంచ శాంతి భద్రతలపై చర్చించినట్లు ప్రధాని మోదీ ఎక్స్ వేదికగా వెల్లడించారు. పాకిస్థాన్ మధ్యవర్తిత్వం వహించిన శాంతి చర్చలు విఫలం కావడంతో ఇరాన్‌పై మళ్లీ దాడులు చేయడానికి ట్రంప్ యోచిస్తున్నారనే వార్తల నడుమ ఈ భేటీ జరిగింది. చర్చల్లో భాగంగా ఇరాన్ సంక్షోభం కూడా ప్రస్తావనకు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రపంచ శ్రేయస్సు కోసం భారత్, అమెరికా కలిసి పనిచేస్తాయని మోదీ పేర్కొన్నారు.

## తమిళనాడులో రాజ్యసభ ఉపఎన్నిక.. సీఎం విజయ్ ప్రభుత్వానికి తొలి పరీక్ష

**తమిళనాడులో రాజ్యసభ ఉపఎన్నికకు షెడ్యూల్ విడుదల**

**జూన్ 18న పోలింగ్, అదే రోజు ఫలితాల వెల్లడి**

**సీవీ షణ్ముగం రాజీనామాతో ఖాళీ అయిన స్థానం**

**సీటును టీవీకే నిలబెట్టుకుంటుందా? లేక మిత్రపక్షాలకు కేటాయిస్తుందా? అనే దానిపై చర్చ**

తమిళనాడులో కొత్తగా అధికారంలోకి వచ్చిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) ప్రభుత్వానికి తొలి రాజకీయ పరీక్ష ఎదురుకానుంది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ స్థానానికి ఉపఎన్నిక నిర్వహించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. జూన్ 18న ఈ ఎన్నికల పోలింగ్ జరగనుంది. ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరుగుతున్న తొలి రాజ్యసభ ఎన్నిక కావడంతో దీనిపై రాజకీయ వర్గాల్లో తీవ్ర ఆసక్తి నెలకొంది.ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో మైలం నియోజకవర్గం నుంచి సీవీ షణ్ముగం ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో ఆయన తన రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా చేయడంతో ఈ స్థానం ఖాళీ అయింది. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం ఉపఎన్నికకు నోటిఫికేషన్ జారీ చేసింది.ఎన్నికల షెడ్యూల్ ప్రకారం జూన్ 1న నోటిఫికేషన్ విడుదల కానుంది. నామినేషన్ల దాఖలుకు జూన్ 8 చివరి తేదీ కాగా, జూన్ 9న నామినేషన్ల పరిశీలన ఉంటుంది. అభ్యర్థులు తమ నామినేషన్లను ఉపసంహరించుకోవడానికి జూన్ 11 వరకు గడువు ఇచ్చారు. జూన్ 18న పోలింగ్ నిర్వహించి, అదే రోజు సాయంత్రం ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలు ప్రకటిస్తారు.తమిళనాడు అసెంబ్లీలో ప్రస్తుతం 233 మంది సభ్యులు ఉన్నారు. రాజ్యసభ స్థానాన్ని గెలుచుకోవాలంటే ఒక అభ్యర్థికి 117 మంది ఎమ్మెల్యేల మద్దతు అవసరం. ఏ ఒక్క పార్టీకి సొంతంగా పూర్తి మెజారిటీ లేనందున, అధికార కూటమి బలాబలాలపైనే ఫలితం ఆధారపడి ఉంది. ప్రస్తుతం సంఖ్యాపరంగా టీవీకే నేతృత్వంలోని కూటమికి స్పష్టమైన ఆధిక్యం కనిపిస్తోంది. దీంతో ఈ సీటును వారే గెలుచుకోవడం ఖాయంగా కనిపిస్తోంది.

**సీఎం విజయ్ ముందు కీలక సవాల్**

అయితే, ఈ కీలకమైన రాజ్యసభ స్థానాన్ని టీవీకే పార్టీయే నిలబెట్టుకుంటుందా? లేక ప్రభుత్వ ఏర్పాటులో మద్దతిచ్చిన కాంగ్రెస్ వంటి మిత్రపక్షాలకు కేటాయిస్తుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ఢిల్లీలో పార్టీ బలాన్ని పెంచుకోవడానికి టీవీకే ఈ అవకాశాన్ని ఉపయోగించుకుంటుందా? లేదా కూటమి ధర్మాన్ని పాటిస్తుందా? అనేది త్వరలో తేలనుంది. నామినేషన్ల ప్రక్రియ దగ్గర పడుతుండటంతో అభ్యర్థి ఎంపికపై చర్చలు వేగవంతం కానున్నాయి. ఈ నిర్ణయం సీఎం విజయ్ రాజకీయ వ్యూహాలకు అద్దం పడుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు.



మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# మృతుల కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి..





**సంగెం మన దునియా మే 23**

వరంగల్ జిల్లా సంగెం మండలంలోని కాట్రపల్లి, నల్లబెల్లి గ్రామాలలో ఇటీవల వివిధ కారణాలతో మృతిచెందిన గాయపు నారాయణ రెడ్డి, అనుముల నర్సమ్మ కుటుంబాలను శనివారం పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి గారు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించిన ఆయన, కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా కల్పించారు. అనంతరం కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న కాట్రపల్లి, నల్లబెల్లి గ్రామాలకు చెందిన బిఆర్ఎస్ నాయకులు మేకల దూడయ్య, గుగులోతు రెడ్యా నాయక్‌లను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యకర్తల కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని ఈ సందర్భంగా చల్లా ధర్మారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, యువజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నాయకుడి దారుణ హత్య?



**మన దునియా,నల్లగొండ జిల్లా:మే 23**

నల్లగొండ జిల్లా సూర్యాపేట మండలం యార్కారం,బిఆర్ఎస్ మాజీ సర్పంచ్ భర్త చింతలపాటి మధు, దారుణ హత్యకు గురయ్యాడు.. ఆయనను శుక్రవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు వేట కొడవళ్ళతో నరికి చంపారు. అనంతరం రెండు ముక్కలుగా చేసి మూడు గోనె సంచుల్లో కట్టి గ్రామ సమీపంలోని ఎస్సా రెసీ, కాలువలో పడేశారు. దీంతో ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.... పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం సూర్యాపేట జిల్లా జనరల్ ఆస్పత్రికి తరలించారు. హత్య కు గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గ్రామంలో కొనసాగుతున్న పాత రాజకీయ విభేదాలే ఈ హత్యకు కారణమై ఉండొొచ్చని అనుమా నాలు వ్యక్తమవుతు న్నాయి. చింతలపాటి మధు భార్య మౌనిక బీఆర్ఎస్ తరఫున గ్రామ సర్పంచ్‌గా గతంలో పనిచేశారు. గ్రామ రాజకీయాల్లో వారి కుటుంబానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉండేది. అయితే కొంతకాలంగా గ్రామంలో రాజకీయ ఆధిపత్య పోరుకొన సాగుతున్నట్లు స్థాని కులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే మధు,హత్య చోటు చేసుకోవడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఇదే గ్రామంలో కొన్నాళ్ల క్రితం అప్పటి సర్పంచ్ మిద్దె రవీందర్, హత్య కేసులో చింతలపాటి మధు, ప్రధాన నిందితుడిగా ఉన్నట్లు తెలుస్తుంది, పాత కక్షల నేపథ్యంలోనే ఈ హత్య జరిగి ఉండ వచ్చునని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కేసును దృష్టిలో ఉంచుకొని పోలీసులు అన్నీ కోనల్లో దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనపై గ్రామ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వరుస రాజకీయ హత్యలతో గ్రామంలో శాంతిభద్రతలు క్షీణిస్తు న్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేసి పరిస్థితిని అదు పులోకి తీసుకురావ డానికి చర్యలు చేపట్టారు. అనుమానితుల కోసం ప్రత్యేక బృందాలు గాలింపు చర్యలు చేపట్టినట్లు సమా చారం. నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు.

# ఆస్తి కోసం ఘోరం.. సొంత చిన్నమ్మను వేటకొడవలితో నరికి చంపిన యువకుడు!

**మన దునియా,కర్నూలు జిల్లా:మే 23**

మానవ సంబంధాలన్నీ ఆర్థిక బంధాలే అని నిరూపించే మరో ఘోరకలి కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. కేవలం రెండు ఎకరాల భూమి కోసం, కన్నతల్లి లాంటి పినతల్లిని ఓ కిరాతకుడు వేటకొడవలితో నరికి చంపిన ఉదంతం స్థానికంగా తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు.కర్నూలు జిల్లా హోళగొంద మండలం సులువాయి గ్రామంలోని హరిజనవాడకు చెందిన గాదిలింగ అనే వ్యక్తికి ఇద్దరు భార్యలు ఉన్నారు. ఆయన తన చిన్న భార్య అయిన ఎల్లమ్మ (50) జీవనాధారం కోసం రెండు ఎకరాల భూమిని రాసిచ్చాడు. అయితే, గాదిలింగ పెద్ద భార్య కుమారుడైన శేకన్న కన్ను ఆ భూమిపై పడింది. ఎలాగైనా ఆ ఆస్తిని తన వశం చేసుకోవాలని పథకం వేశాడు.ఘటన జరిగిన రాత్రి శేకన్న మద్యం మత్తులో పినతల్లి ఎల్లమ్మ ఇంటికి వెళ్లాడు. ఆమె పేరు మీద ఉన్న రెండు ఎకరాల పొలాన్ని తన పేరు మీద రాసివ్వాలని అంటూ గొడవకు దిగాడు. అందుకు ఎల్లమ్మ.. తనకు కూడా ముగ్గురు కుమార్తెలు ఉన్నారు, వారి భవిష్యత్తు కోసం ఈ భూమి కావాలి, రాసి ఇవ్వనంటూ తెగేసి చెప్పింది. దీంతో తీవ్ర ఆగ్రహానికి లోనైన శేకన్న, మొదట ఆమెపై కర్రతో దాడి చేశాడు. అంతటితో శేకన్న కసి తీరలేదు. అర్ధరాత్రి సమయంలో ఎల్లమ్మ తన ఇంటి ఆవరణలో నిద్రిస్తుండగా, శేకన్న వేటకొడవలితో అక్కడికి చేరుకున్నాడు. నిద్రపోతున్న పినతల్లి అని కూడా చూడకుండా విచక్షణారహితంగా నరికి ఘాతుకానికి ఒడిగట్టాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఎల్లమ్మ అక్కడికక్కడే ప్రాణాలు విడిచింది. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు.ఘోర హత్యతో సులువాయి గ్రామ ప్రజలు ఒక్కసారిగా భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకున్నారు. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతురాలి ముగ్గురు కుమార్తెలు తల్లి శవాన్ని చూసి కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఆస్తి కోసం కన్నవారిని, కుటుంబ సభ్యులను సైతం పొట్టనబెట్టుకుంటున్న కాలానికి ఈ సంఘటన మరో మాయని మచ్చగా మిగిలింది.



## మండే ఎండలకు పశువులు,పక్షులు విలవిల!

**మన దునియా,కరీంనగర్ జిల్లా:మే 23**



తెలంగాణ రాష్ట్రంలో గత రెండు, మూడు రోజులుగా ఉష్ణోగ్రతలు భారీగా పెరిగిపోవడం తో ప్రజలు ఉక్కిరి, బిక్కిరి, అవుతున్నారు భానుడి భగభగలకు కొన్ని ప్రాంతాలలో వడదెబ్బలు తగిలి జనాలు మరణిస్తున్నా రు.కేవలం మనుషులే కాకుండా పశువులు, పక్షులు కూడా ఎండ తీవ్రతకు ప్రాణాలు కోల్పోవడం కలచి వేస్తుంది,శనివారం మెదక్ జిల్లా తూప్రాన్ లో మండే ఎండలకు ఓ రైతుకు సంబంధిం చిన ఎద్దు మరణించిం ది,అలాగే కరీంనగర్ జిల్లా హుజరాబాద్ మండ లం పరిధిలోని బోర్న పల్లి శివారులో శుక్ర వారం మధ్యాహ్నం ఎండ తీవ్రతను తట్టు కోలేక రామచిలుకలు రోడ్డుపైనే సొమ్మసిల్లి పడిపోయి ప్రాణాలు కోల్పోతున్నాయి,

## కాటారంలోనే పాలీసెట్ కౌన్సిలింగ్ సేవలు

**మన దునియా,భూపాలపల్లి జిల్లా:మే 23**



తెలంగాణ రాష్ట్రం లోని డిప్లమా ఇన్- ఇంజనీరింగ్, పాలిటె క్నిక్ పాలీసెట్ 2026 ఫలితాలుశనివారం ఉదయం 11:30 గంటలకు మాసాబ్ ట్యాంకులోని సాకేతిక విద్యమండలి కార్యాలయంలో ఈ ఫలితాలను టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీ దేవసేన విడుదల చేశారు. విద్యార్థుల మార్కుల ఆధారంగా తెలంగాణ లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీల్లో ఇంజనీరింగ్ నాన్ -ఇంజనీరింగ్ టెక్నా లజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు కల్పించబడ తాయి,ఈ నేపథ్యం లోనే విద్యార్థుల సౌకర్యార్థం భూపాల పల్లి జిల్లా కాటారం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేసినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా. రాజ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ఆయన తెలిపిన వివరాల ప్రకారం... పాలీసెట్ పరీక్ష రాసి పాలిటెక్నిక్ సీటు పొందే విద్యార్థు లు ఇకపై దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా కాటారంలోనే ధృవపత్రాల పరిశీలన, కౌన్సిలింగ్ ప్రక్రియ, వెబ్ ఆప్షన్ల నమోదు వంటి సేవలను పొందవచ్చన్నారు.ఇప్పటి వరకు విద్యా ర్థులు వరంగల్, భూపాలపల్లి, కరీంనగర్,వంటి దూర ప్రాంతాలకు వెళ్లి కౌన్సి లింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాల్సి వచ్చే దని, దీనివల్ల సమయం మరియు వ్యయభారం పెరుగు తుండేదన్నారువిద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సహాయక కేంద్రాన్ని కాటారం లో ఏర్పాటు చేసిందని తెలిపారు.పాలీసెట్ తొలి విడత కౌన్సిలింగ్‌లో భాగంగా ధృవపత్రాల పరిశీలన ఈ నెల 29-05-2026 నుండి 01-06-2026 వరకు నిర్వహించను న్నట్లు వెల్లడించారు. అర్హత కలిగిన విద్యా ర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకొని సమయానికి కౌన్సి లింగ్ ప్రక్రియ పూర్తి చేసుకోవాలని ప్రిన్సిపాల్ కోరారు.

## తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ కు అభినందనలు తెలిపిన శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం సభ్యులు

**మన దునియా,హైదరాబాద్:మే 23**

హైదరాబాద్: తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ (టీబీఎస్పీ) నూతన చైర్మన్‌గా పదవి బాధ్యతలు చేపట్టిన శ్రీ బసవరాజు శ్రీనివాస్ రావుని, శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ అధ్యక్షతన సంఘ కార్యవర్గ సభ్యులు సీనియర్ జర్నలిస్ట్ సర్వేపల్లి రమేష్ కుమార్, సింహాచలం శ్రీధరాచార్యులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం బ్రాహ్మణ సమాజ సంక్షేమానికి సంబంధించిన పలు అంశాలతో కూడిన "అభినందన పూర్వక వినతి పత్రం"ను అందజేశారు. ముఖ్యంగా గత నాలుగేళ్లుగా పెండింగ్‌లో ఉన్న వి. వో.ఇ.ఎస్, బెస్ట్ తదితర పథకాల బకాయిల విడుదల, పేద బ్రాహ్మణ కుటుంబాలకు హెల్త్ ఇన్సూరెన్స్, బ్రాహ్మణ భవనాల నిర్మాణం, వేద పాఠశాలలకు సహాయం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, అర్చకులకు జీవన భృతి, వృద్ధ వేద పండితులకు ఆర్థిక సహాయం, పేద విద్యార్థులకు విద్యా సహకారం మరియు పేద, మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబాల సొంతింటి కల సాకారం వంటి అంశాలను వినతి పత్రంలో ప్రస్తావించారు. ఈ విషయాలపై త్వరితిగతిన చర్యలు చేపట్టాలని సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ చైర్మన్ కు విజ్ఞప్తి చేశారు.ఈ అంశాలపై చైర్మన్ శ్రీ బసవరాజు శ్రీనివాస్ రావు సానుకూలంగా స్పందిస్తూ, బ్రాహ్మణ సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్, సంఘ కార్యవర్గ సభ్యులు, ముఖ్య సలహాదారులు సీనియర్ జర్నలిస్ట్ సర్వేపల్లి రమేష్ కుమార్, సంఘం కార్యదర్శి సింహాచలం శ్రీధరాచార్యులు, తదితరులు పాల్గొన్నారు.



మన దునియా
మన అక్షరం – మన ప్రపంచం

# 19 ప్లాట్లు, 2 ఎకరాల్లో ఫామ్ హౌస్...

## మేడ్చల్ డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్ అరెస్టు

**ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా 11 ప్రాంతాల్లో ఏసీబీ సోదాలు**

**బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు**

**వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ప్లాట్లు గుర్తింపు**

**రూ.1.2 కోట్ల విలువైన 3 ఇళ్లను గుర్తించిన అధికారులు**

**మన దునియా,మేడ్చల్ మల్కాజ్‌గిరి:మే 23**



మేడ్చల్ మల్కాజ్‌గిరి డిప్యూటీ కలెక్టర్ వంశీమోహన్‌ను ఏసీబీ అరెస్టు చేసింది. ఈరోజు ఉదయం నుంచి ఆయన కార్యాలయం సహా మరో 11 ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బంధువులు, స్నేహితుల ఇళ్లలో సోదాలు జరిగాయి. ఈ సోదాల్లో వంశీమోహన్‌కు సంబంధించిన భారీగా ఆస్తులను గుర్తించారు. వనస్థలిపురం, మణికొండ, మజీద్‌కొండ ప్రాంతాల్లో రూ.4.46 కోట్ల విలువైన 19 ఓపెన్ ప్లాట్లు, రూ.1.2 కోట్ల విలువైన 3 ఇళ్లను గుర్తించారు.ఇబ్రహీంపట్నం పరిధిలోని నారపల్లి వద్ద 2 ఎకరాల్లో ఫామ్ హౌస్ ఉన్నట్లు గుర్తించారు. శేరిలింగంపల్లి, ఇతర ప్రాంతాల్లో వంశీమోహన్ ఆర్డీవోగా పనిచేశారు. ఆర్డీవోగా పని చేసిన సమయంలో పెద్ద ఎత్తున ప్రభుత్వ భూములను సొంతం చేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి.అబ్దుల్లాపూర్‌మెట్, పిగ్లీపురంలో ఎనిమిది ఎకరాలు ఆక్రమించినట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి. భూములను తొలుత తన మామ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించి ఆ తర్వాత రియల్టర్లకు ధారాదత్తం చేసినట్లు ఏసీబీ అధికారులు గుర్తించారు. ఈ క్రమంలో ఒక రియల్టర్ నుంచి పది ప్లాట్లను గిఫ్ట్ డీడ్ చేయించుకున్నట్లు అధికారులు గుర్తించారు. దీంతో ఏసీబీ అధికారులు ఆయనను అరెస్టు చేశారు.

# ఇంటర్మీడియట్ గ్రూపులో ప్రవేశాలు మొదలయ్యాయి

**గోవిందరావుపేట ఎంపీడీవో సిహెచ్ వరుణ్ కుమార్**

**ములుగు జిల్లా మే 23 మన దునియా**




గోవిందరావుపేట తెలంగాణ మోడల్ స్కూల్ చల్వాయి లో (లక్కవరం క్రాస్ రోడ్ దగ్గర హైవే మీద ఉన్నది). ఇంటర్మీడియట్ గ్రూపులలో ప్రవేశాలు మొదలయ్యాయి అని గోవిందరావుపేట ఎంపీడీవో సిహెచ్ వరుణ్ కుమార్ అన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన అద్భుతమైన ఇంగ్లీష్ మీడియం లో ఇంటర్మీడియట్ తోపాటు ఎఫ్ సెట్,నీట్,ఐ ఐ టి కోచింగ్ తో పాటు అద్భుతమైన బోధన ఇక్కడ చేయబడుతుంది అన్నారు. గర్ల్స్ కి హాస్టల్ లో సదుపాయం కలదు. కావున మీకు తెలిసిన లేదా మధ్యతరగతి తల్లిదండ్రులు లేని పిల్లలకు ప్రైవేటులో ఎక్కువగా డబ్బులు ఖర్చు పెట్టలేని తల్లిదండ్రులకు ఈ విషయాన్ని మీకు సంబంధించిన వారికి తెలియజేయాలని ఎంపీడీవో అన్నారు.భవిష్యత్తులో మంచిగా వృద్ధి చెందేందుకు భావితరాల పిల్లలను ఆశీర్వదించండి. ఇంటర్మీడియట్ డే స్కాలర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కూడా ఉంటుంది.6 తరగతి నుండి 10వ తరగతి విద్యార్థులకు కూడా అడ్మిషన్స్ కలవు మరియు హాస్టల్ వసతి కూడా కలదు వారు కూడా నేరుగా సంప్రదించి చేరవచ్చు అని అన్నారు. ఇంకా పూర్తి వివరాలు కావాలనుకుంటే మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ కుమార్ యొక్క నంబర్ కి 8096350115 సంప్రదించగలరని తెలిపారు

# ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు బిగ్ షాక్..

**ఆ పార్టీలకు రాజీనామా చేసిన టీఆర్పీ లో చేరిక.!**

**కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ చీఫ్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న...**

**బహుజన రాజ్యం స్థాపనే టీఆర్పీ లక్ష్యం..**

**మన దునియా,అదిలాబాద్ జిల్లా: మే 23**



అదిలాబాద్ జిల్లా: తెలంగాణ రాష్ట్రంలో బహుజన రాజ్యం కోసం నిరంతరం పోరాటం చేస్తున్న తెలంగాణ రాజ్యాధికార పార్టీ లోకి పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎల్లబోయిన ఓదెలు యాదవ్,స్టేట్ సెక్రటరీ మరియు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్చార్జి కొమ్ముల ప్రవీణ్ రాజ్ ఆధ్వర్యంలో అదిలాబాద్ జిల్లాలో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష బిజెపి పార్టీలకు గట్టి షాక్ ఇస్తూ.. ఆ పార్టీలకు గుడ్ బై చెప్పి ఈరోజు టీఆర్పీ కార్యాలయంలో జరిగిన చేరికల కార్యక్రమంలో తెలంగాణ రాజ్యాధికారం పార్టీలో వారందరూ చేరారు.. చేరిన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన పార్టీ అధినేత ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న....ఈ సందర్భంగా మల్లన్న మాట్లాడుతూ...తెలంగాణ గడ్డపై బహుజనుల ఆత్మగౌరవం మరియు రాజ్యాధికార స్థాపనే లక్ష్యంగా టిఆర్పి నిరంతరం పోరాడుతోందని అన్నారు. ప్రజా సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తున్న తమ పార్టీ సిద్ధాంతాలు నచ్చే ఇతర పార్టీల నుండి పెద్ద ఎత్తున నాయకులు తరలివస్తున్నారని కొనియాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో పార్టీని గ్రామస్థాయి నుండి మరింత బలోపేతం చేయడానికి ఈ చేరికలు ఎంతో దోహదపడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీ నమ్మి వచ్చిన ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం మరియు గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు తాళ్ల రవీందర్, కోఆర్డినేటర్ లింగం యాదవ్,మరియు పార్టీలో చేరిన నాయకులు పానుగంటి విఠల్,భాస సంతోష్, ఠాక్రే మహేంద్ర, కోటావారు సాయికృష్ణ, కామ్రే మనోజ్, డొకే విఠల్, భగత్ ప్రకాష్, ఈరగొల్ల దత్తాత్రి తదితరులు పాల్గొన్నారు

# కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి సాధ్యం





**సంగెం మన దునియా మే 23**

బొల్లికుంటలో రూ.60 లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీ పరిధిలోని 17వ డివిజన్ బొల్లికుంట గ్రామంలో రూ.60 లక్షల నిధులతో చేపడుతున్న కూడలి అభివృద్ధి పనులు, సిసి రోడ్లు మరియు మురుగు కాలువల నిర్మాణ పనులకు హన్మకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు చాహాత్ బాజ్ పాయి, డాక్టర్ సత్య శారద జిడబ్లుఎంసి మాజీ మేయర్ మేయర్ శ్రీమతి గుండు సుధారాణి లతో కలిసి పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...పట్టణాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని,కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలోనే నిజమైన అభివృద్ధి మహర్దశను చేరుకుంటుందని అన్నారు.కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అన్ని వర్గాల అభివృద్ధికి కట్టుబడి ఉందని,ముఖ్యంగా ప్రతి కాలనీలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు.పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని, ప్రతి కుటుంబం ఆర్థికంగా ఎదిగడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని,ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.అనంతరం ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా లబ్ధిదారులకు శాలువాతో సన్మానించి, కుటుంబ సభ్యులతో ఆనందాన్ని పంచుకున్నారు.

# వరంగల్,కాశీబుగ్గ లో.. డా.ఈర్ల ప్రశాంత్ - మౌనిక ముదిరాజు శ్రీ.విజయ హాస్పిటల్ ప్రారంభోత్సవం..





**ఎదుగుతున్న జాతి బిడ్డలను ప్రోత్సహిద్దాం**

**మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్**

**మన దునియా వరంగల్,కాశిబుగ్గ: మే 23**

డా.ఈర్ల ప్రశాంత్ – మౌనిక ముదిరాజు ల ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని కాశిబుగ్గ లో ఏర్పాటు చేసిన శ్రీవిజయ హాస్పిటల్ ను పులి దేవేందర్ ముదిరాజ్ అధితిగా ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రంగం ఏదైనా అందులో ఎదుగుతున్న ముదిరాజ్ జాతీ బిడ్డలను ముదిరాజ్ లు ప్రోత్సాహించాలని,ఏం డి జనరల్ మెడిసిన్ గా ఈర్ల ప్రశాంత్,స్త్రీ వైద్య నిపుణులు మౌనిక ముదిరాజ్ ల సేవలు అందరూ వినియోగించుకోవాలని, పులి దేవేందర్ ముదిరాజ్ అన్నారు.ముదిరాజ్ లు సైతం అన్ని రంగాల్లో రానించగలరు అని నిరూపించేలా డాక్టర్ ఈర్ల ప్రశాంత్ –మౌనిక ముదిరాజ్ లు వైద్య సేవలు అందించాలని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తే వారి గుండెల్లో నిలిచే అవకాశం ఉంటుందనీ, ముదిరాజ్ ల కులఆరాధ్య దైవం పెద్దమ్మ తల్లి ఫోటో బహుకరించి,ఆశీర్వదించారు. వరంగల్ జిల్లా, నల్లబెల్లి మండలం, రుద్రగూడెం గ్రామానికి చెందిన ఈర్ల రవి– విజయ ముదిరాజ్ ల రెండవ కుమారుడు డా.ప్రశాంత్ ముదిరాజ్ ఈ స్థాయికి రావడానికి పడ్డ కష్టాలను యువత ఆదర్శంగా తీసుకుని ఎదగాలన్నారు.కాశీబుగ్గ లో ఏర్పాటు చేసిన విజయ హాస్పిటల్ ప్రారంభోత్సవం కార్యక్రమంలో మెపా హనుమకొండ జిల్లా అధ్యక్షులు పులి రాజేష్ ముదిరాజ్,హాస్పిటల్ యాజమాన్యం డా.ఈర్ల ప్రశాంత్ – మౌనిక ముదిరాజ్, డా.గుండాల మదన్ కుమార్, డా.శివరామ్ రెడ్డి,డా.ప్రణయ్, ఈర్ల రవి విజయ,ఈర్ల నాగరాజు,సరిత ,కిరణ్ అనూష ముదిరాజ్,పెండ్యాల ప్రభాకర్,యాతిరాజుల నగేష్, నకిరబోయిన సంతోష్, మోటం వినయ్,వేణు లతో పాటు కుటుంబ సభ్యులు బంధువులు పాల్గొన్నారు

# కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను పరిశీలించిన ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు






**మన దునియా,ములుగు జిల్లా, మల్లంపల్లి:మే 23**

రామచంద్రపురం గ్రామపంచాయతీ కోయగూడెం లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించారు.శనివారం ములుగు జిల్లా మల్లంపల్లి మండలం రామచంద్రాపురం గ్రామపంచాయతీ కోయగూడెం లోని జిల్లా పరిషత్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు పరిశీలించి పలు వివరాలపై ఆరా తీశారు.మల్లంపల్లి మండల కేంద్రంలోని సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలను కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు తరలించే ప్రతిపాదన దృష్ట్యా గురుకుల విద్యార్థులకు హాస్టల్ వసతి, అదనపు తరగతి గదుల కల్పన, ఇతర మౌలిక సదుపాయాలకు సంబంధించిన అంచనాలను సిద్ధం చేయాలని సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, విద్యాశాఖ అధికారి సిద్ధార్థ రెడ్డి, సోషల్ వెల్ఫేర్ డి సి ఓ వెంకటేశ్వర్లు, డి ఈ రామకృష్ణ, స్థానిక ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం



# ఊరు కోసం ఒక్కరోజు. శ్రమదానం






### ఊరు బాగుకోరుకునే వారంతా కదిలి రావాలి సర్పంచ్ పబ్బు సతీష్

**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

"ఊరు బాగుండాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి.. వారంలో కనీసం ఒక్కరోజైనా గ్రామం కోసం శ్రమిద్దాం" అంటూ కమలాపూర్ సర్పంచ్ పబ్బు సతీష్ గ్రామ యువత, ప్రజలకు పిలుపునిచ్చారు. స్వచ్ఛ కమలాపూర్ లక్ష్యంగా నిర్వహించిన "ఊరి కోసం ఒక్క రోజు" శ్రమదానం కార్యక్రమం శనివారం గ్రామంలో ఉత్సాహంగా సాగింది.గ్రామంలోని డ్రైనేజీలు, రోడ్లు, చెత్తాచెదారాన్ని స్వయంగా శుభ్రం చేస్తూ సర్పంచ్ పబ్బు సతీష్ ఆదర్శంగా నిలిచారు. వార్డు సభ్యులు, మహిళా సంఘాల సీఏలు, వివో అధ్యక్షులు, పారిశుధ్య సిబ్బంది, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రమదానం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా స్వగ్రామానికి వచ్చిన నేటిదాత్రి గ్రూప్స్ చైర్మన్ కట్ట రాఘవేంద్ర రావు, సీఈవో కట్ట శివ సుబ్రమణ్యం పాల్గొని గ్రామ అభివృద్ధికి తమ వంతు సహకారం అందించారు. వారు గ్రామంలో డ్రైనేజీలు, రోడ్లు శుభ్రం చేస్తూ ప్రజల్లో చైతన్యం కల్పించారు.ఈ సందర్భంగా సర్పంచ్ పబ్బు సతీష్ మాట్లాడుతూ గ్రామం పెద్దదిగా ఉండటంతో తక్కువ పారిశుధ్య సిబ్బందితో పరిశుభ్రత నిర్వహణ సవాలుగా మారిందన్నారు. అందుకే గ్రామస్తులందరినీ పారిశుధ్య పరిరక్షణలో భాగస్వాములను చేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు.మురుగు కాలువల శుభ్రత, చెత్త తొలగింపు, మొక్కల సంరక్షణ ప్రధాన లక్ష్యాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని చెప్పారు. గ్రామాభివృద్ధిని కోరుకునే ప్రతి యువకుడు, గ్రామస్తుడు వారంలో కనీసం ఒక రోజు గ్రామం కోసం కేటాయించాలని కోరారు."రండి.. మనమంతా కలిసి కమలాపూర్‌ను ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుకుందాం" అంటూ సర్పంచ్ పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పుల్ల శ్రీనివాస్, శిశుమందిర్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు స్వరూపరాణి, వార్డు సభ్యులు, యువకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# వి.ఓ.ఏల సమస్యలు , జేఏసీ ఆధ్వర్యంలో, ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి సమ్మె నోటీసు అందజేత



తేది:-23.-05-2026

శ్రీయుత గౌరవనీయులైన...MLA హుజురాబాద్.....,
...........................గారికి.,

విషయం :- తెలంగాణ రాష్ట్ర జే.ఏ.సీ. "వి.ఓ.ఏ.ల సమస్యల పరిష్కారం కొరకు సమ్మె నోటీసు సమాచారం నిమిత్తం.

అయ్యా.. !

-:o:-

పై విషయమును పురస్కరించుకొని తమరితో తెలియజేయునది ఏమనగా, తెలంగాణ ఐ.కె.పి. (యస్.ఇ.ఆర్.పి.) జే.ఏ.సీ. "వి.ఓ.ఏ"ల రిజిష్టర్డు నెం.363/2025, 302/2022. ఈ రోజున జే.ఏ.సీ. "వి.ఓ.ఏ"లు అందరము కలిసి తేది: 04-05-2026 సోమవారం రోజున సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. రాష్ట్ర కమిటీ ఏకాభిప్రాయం మేరకు "వి.ఓ.ఏ"ల సమస్యలపై రాష్ట్ర వ్యాప్తంగా "వి.ఓ.ఏ"లు అందరు సమ్మె చేయాలని నిర్ణయించడం జరిగింది. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించని యెడల తేది: 18-05-2026 రోజు నుండి రాష్ట్ర వ్యాప్తంగా "వి.ఓ.ఏ"లు అందరు శాంతియుత నిరవధిత సమ్మె నిర్వహించాలని నిర్ణయించడం జరిగింది. మా యొక్క ప్రధాన డిమాండ్లు ఈ క్రింది విధముగా కలవు. అవి.

డిమాండ్లు:

1. "వి.ఓ.ఏ."ల కనీస వేతనం రూ.20,000/-లు ఇవ్వాలి.
2. యస్.ఇ.ఆర్.పి. ఉద్యోగులుగా గుర్తించి హెచ్.ఆర్. పాలసీ వర్తింపజేయాలి.
3. అర్హులైన "వి.ఓ.ఏ"లకు సీ.సీ. పదోన్నతి కల్పించాలి.
4. "వి.ఓ.ఏ."లకు సాధారణ మరియు ఆరోగ్య భీమా సౌకర్యం (రూ.20లక్షలు).
5. ట్యాబ్ సౌకర్యం కల్పించాలి.
6. 58 జీ.ఓ.ను సవరించాలి.

ఇట్లు
మీ విశ్వాసనీయ,
మండలం :- వీణవంక.

G Lavanya
గాజుల లావణ్య
కోశాధికారి

E Arpana
ఎల్కపెల్లి అర్పన
కార్యదర్శి

నరహరి శ్రీలత
అధ్యక్షురాలు

శ్రీలక్ష్మి గణపతి VOAల సంఘం
మం॥ వీణవంక, జి॥ కరీంనగర్.



**మన దునియా హుజురాబాద్ నియోజకవర్గం**


హుజూరాబాద్,తెలంగాణ రాష్ట్ర వి.ఓ.ఏల సమస్యల పరిష్కారం కోరుతూ జేఏసీ ఆధ్వర్యంలో సమ్మె నోటీసును హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి కి శనివారం హుజూరాబాద్ క్యాంపు కార్యాలయంలో అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ జి.ఓ.ఎం.ఎస్ నెం.363/2025, 302/2022 ప్రకారం వి.ఓ.ఏలందరికీ నూతన సేవా రూల్స్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు.సంఘం తరపున ప్రధానంగా వి.ఓ.ఏలకు కనీస వేతనం రూ.20 వేలుగా నిర్ణయించాలని, యస్.ఇ.ఆర్.పి ఉద్యోగులుగా గుర్తించి హెచ్‌ఆర్ పాలసీ వర్తింపజేయాలని, అర్హులైన వి.ఓ.ఏలకు సీనియారిటీ ప్రకారం సీసీగా పదోన్నతులు కల్పించాలని కోరారు. అదేవిధంగా సాధారణ, ఆరోగ్య భీమా సౌకర్యాలు కల్పించడంతో పాటు ట్యాబ్ సౌకర్యం అందించాలని, 58 జి.ఓను సవరించాలని డిమాండ్ చేశారు.వి.ఓ.ఏల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి వెంటనే చర్యలు తీసుకునేలా కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరినట్లు సంఘ ప్రతినిధులు తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ, వి.ఓ.ఏల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## ములుగు జిల్లా వాజేడు మండలం బొగత వద్ద పర్యాటకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని

### కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సాహదేవరావు

**మన దునియా ,వాజేడు,మే 23**







రానున్న వర్షాకాలం సీజన్ ని దృష్టిలో ఉంచుకొని ములుగు జిల్లాకు వచ్చే టూరిజం పర్యాటకులకు అహల్లాదకరమైన వాతావరణంతో పాటు మెరుగైన వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ బొర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు శనివారం వాజేడు మండలం చీకుపల్లిగ్రామంలో బొగత జలపాతాన్ని సందర్శించి పరిసర ప్రాంతాలను పరిశీలించిన పర్యటకుల కోసం త్రాగునీరు మరుగుదొడ్లు వాహనాల పార్కింగ్ సీసీ కెమెరాలు పటిష్ట భద్రత ఏర్పాటు కల్పించాలని పర్యాటకులకు సైన్ బోర్డ్ ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమం అటవీశాఖ అధికారులు రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు

# కమలాపూర్‌లో తాటి వనం దగ్ధం

**1000 తాటి చెట్లు బూడిద.. కల్లు పారే 100 చెట్లు పూర్తిగా కాలిపోయిన ఘటన**
**పొద్దున్నే తాటి చెట్టు ని మొక్కే గౌడన్న, నేడు జీవన ఆధారం లేకుండా పాయె,**
**మంటలో కాలిపోతున్న ఏమి చేయలేని దుస్థితి**
**ప్రభుత్వం ఏమైనా ఆసరాగా చేయూత నిచ్చెన**



**మన దునియా ప్రతినిధి కమలాపూర్**

కమలాపూర్ మండలంలోని ఎల్లమ్మ దేవాలయం సమీపంలో, కన్నూరు రహదారిలో దుబ్బల వద్ద ఉన్న తాటి వనంలో శనివారం భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు వేగంగా వ్యాపించి తాటి వనాన్ని చుట్టుముట్టాయి.ఈ ప్రమాదంలో సుమారు 1000 తాటి చెట్లు దగ్ధమయ్యాయని, వాటిలో కల్లు పారే దాదాపు 100 తాటి చెట్లు పూర్తిగా కాలిపోయినట్లు స్థానికులు తెలిపారు. అగ్నికి ఆహుతైన చెట్లతో తాటి కార్మికులు, రైతులకు భారీ నష్టం వాటిల్లింది.మంటలు గమనించిన స్థానికులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. గంటల పాటు శ్రమించి మంటలను ఆపే ప్రయత్నం చేశారు . అయితే అప్పటికే పెద్ద ఎత్తున తాటి వనం దగ్ధమైంది.అగ్ని ప్రమాదానికి గల కారణాలు తెలియరాలేదు. అధికారులు ఘటనపై ఆరా తీస్తున్నారు. వేసవి కాలంలో తరచూ అగ్ని ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## మృతుడి కుటుంబానికి అండగా నిలిచిన భూక్య జాన్సన్ నాయక్

**ఖానాపూర్ ఆర్సి మన దునియా మే;23.**



దస్తురాబాద్ మండలం గొడిసిర్యాల్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పొడేటి మహేందర్ గౌడ్ అకాల మరణం పట్ల జాన్సన్ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మహేందర్ గౌడ్ కుటుంబాన్ని స్వయంగా పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన భూక్య జాన్సన్ నాయక్, కుటుంబ సభ్యులను ఓదారుస్తూ "ధైర్యంగా ఉండాలి.. పార్టీ తరఫున నేను మీకు ఎల్లప్పుడూ అండగా ఉంటాను" అని భరోసా కల్పించారు. అనంతరం కుటుంబ అవసరాల కోసం ఆర్థిక సహాయాన్ని అందజేశారు.పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలు కష్టపడి పనిచేసిన మహేందర్ గౌడ్ సేవలను ఈ సందర్భంగా నాయకులు గుర్తు చేసుకున్నారు. కార్యకర్తల కష్టసుఖాల్లో ముందుండే భూక్య జాన్సన్ నాయక్ చేసిన సహాయం పట్ల గ్రామస్తులు, పార్టీ నాయకులు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు మరియు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ఎండవేడికి వృద్ధురాలి మృతి. వంగపల్లిలో విషాదం

**కమలాపూర్, మన దునియా ప్రతినిధి**



హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలంలోని వంగపల్లి గ్రామంలో ఎండవేడికి ఓ వృద్ధురాలు మృతి చెందిన ఘటన గ్రామంలో విషాదాన్ని నింపింది. గ్రామానికి చెందిన పోడేటి లచ్చమ్మ (82) తీవ్ర వడదెబ్బకు గురై ప్రాణాలు కోల్పోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.వివరాల్లోకి వెళ్తే.. లచ్చమ్మ తన తల్లిగారైన గోపాలపురం గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మార్గమధ్యలో తీవ్ర ఎండవేడికి అస్వస్థతకు గురయ్యారు. జిల్లాలో గత కొన్ని రోజులుగా ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతున్న నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం సుమారు 5 గంటల సమయంలో ఆమె ఒక్కసారిగా స్పృహ కోల్పోయి కుప్పకూలినట్లు స్థానికులు తెలిపారు.వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స కోసం తరలించే ప్రయత్నం చేసినప్పటికీ అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిసింది. ఈ ఘటనతో వంగపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. లచ్చమ్మ మృతితో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. గ్రామస్థులు ఆమె మృతిపై సంతాపం వ్యక్తం చేశారు.మండుతున్న ఎండల నేపథ్యంలో వృద్ధులు, చిన్నపిల్లలు అత్యవసర పరిస్థితులు తప్ప బయటకు రావద్దని, తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

మన దునియా
మన అక్షరం - మన ప్రపంచం

## చెరుకూరు నుంచి ధర్మవరం వరకు రహదారి నిర్మాణం అటవీ శాఖ అడ్డంకులు తొలగించాలని సిపిఎం డిమాండ్

**మన దునియా, వాజేడు, మే 23**




ములుగు జిల్లా వాజేడు మండలం చెరుకూరు నుంచి ధర్మవరం వరకు రహదారి నిర్మాణం పూర్తి చేయాలని అటవీశాఖ అడ్డంకులు వెంటనే తొలగించాలని సిపిఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి డిమాండ్ చేశారు శనివారం సిపిఎం ఆధ్వర్యంలో చెరుకూరు ధర్మవరం రహదారిని పరిశీలించి నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నిసార్లు ప్రభుత్వం దృష్టికి సమస్యను తీసుకెళ్లి న స్పందన లేదని విమర్శించారు ధర్మవరం నుంచి చెరుకూరు వరకు రహదారి పూర్తిగా గుంతల మయంగా మారి ప్రజా అవసరాలకు తీవ్ర అంతరాయం కలుగు తుందని ఇసుక లారీలో రాకపోక వల్ల రోడ్డు మరింత దెబ్బతిన్నదని అత్యవసర సమయంలో అంబులెన్స్ కూడా వెళ్లలేని స్థితిలో ఉందని గ్రామాల మధ్య అటవీ భూమి ఉండడంతో రహదారి నిర్మాణానికి అటవీశాఖ అభ్యంతరాలు తెలుపుతూ పనులు నిలిపి వేస్తుందని ఆరోపించారు ప్రజా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం అటవీశాఖ అధికారులతో చర్చించి వెంటనే రహదారి నిర్మాణం చేపట్టాలని లేదంటే సిపిఎం ఆధ్వర్యంలో దశల వారి ఆందోళన చేపడతామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు గారా సదా క్రీం గౌరారం చంద్రశేఖర్ బలుసు పార్టీ నరేష్ మహేందర్ అల్లి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు

## సెర్వైకల్ నొప్పితో బాధపడుతున్నారా?

ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. ఈ డిజిటల్ యుగంలో చాలా మంది గంటల తరబడి కంప్యూటర్, ల్యాప్‌టాప్ లేదా మొబైల్‌పై పని చేస్తారు. దీని వల్ల మెడ, భుజాలపై ఒత్తిడి పెరుగుతుంది. ఈ కారణంగా చాలా మంది సెర్వైకల్ స్పాండిలైటిస్ లేదా మెడ నొప్పి సమస్యను ఎదుర్కొంటారు. మెడలో బిగుసుకుపోవడం, భుజాలలో ఒత్తిడి, తలనొప్పి, వీపు నొప్పి వంటివి సెర్వైకల్ లక్షణాలుగా ఉండవచ్చు. సెర్వైకల్ నొప్పిని తగ్గించడానికి మీరు కొన్ని వ్యాయామాల సహాయం తీసుకోవచ్చు. ఈ వ్యాయామం మెడ బిగుసుకుపోవడాన్ని తగ్గిస్తుంది. కండరాలను సడలిస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి నిటారుగా కూర్చోండి లేదా నిలబడండి. ఆ తర్వాత మెడను నెమ్మదిగా ముందుకు వంచండి. ఆపై వెనుకకు వంచండి. ఈ ప్రక్రియను 5 నుండి 10 సార్లు చేయండి. దీని వల్ల సెర్వైకల్ నొప్పి తగ్గవచ్చు. ఇది మెడ సౌలభ్యాన్ని పెంచుతుంది. రక్త ప్రసరణను మెరుగుపరుస్తుంది. ఈ వ్యాయామం చేయడానికి తలను నెమ్మదిగా కుడి వైపుకు తిప్పండి. కొన్ని సెకన్ల పాటు ఆపండి. ఆ తర్వాత తలను ఎడమ వైపుకు తిప్పండి. రెండు దిశలలో ఒక్కొక్కటి 5 సార్లు చేయండి. ఇది మెడ పక్కని కండరాలకు ఉపశమనం కలిగిస్తుంది. తలను నెమ్మదిగా కుడి వైపుకు వంచండి (చెవిని భుజం వైపు తీసుకురండి). 10 సెకన్ల పాటు ఆపండి. ఆపై ఎడమ వైపుకు పునరావృతం చేయండి. ఈ ప్రక్రియను 3-4 సార్లు చేయండి. ఈ భంగిమ మీ మెడ స్థానాన్ని మెరుగుపరుస్తుంది. సెర్వైకల్ నొప్పిని తగ్గిస్తుంది. దీన్ని చేయడానికి మీ వీపు, మెడను నిటారుగా ఉంచండి. ఆపై గడ్డాన్ని మెడ వైపు నెమ్మదిగా లోపలికి లాగండి. 5 సెకన్ల పాటు ఆపి, ఆ తర్వాత సాధారణ స్థితికి తిరిగి వెళ్లండి. దీన్ని 10 సార్లు పునరావృతం చేయండి.

## బీపీతో ఇబ్బందిపడుతున్నారా?


రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అరటిపండు.. ప్రతి సీజన్‌లో ప్రతిచోటా సులభంగా లభించే పండు. ఇది ఒక సూపర్ ఫుడ్. వైద్యుల నుండి డైటీషియన్ల వరకు అందరూ రోజూ తినాలని సిఫార్సు చేస్తారు. ముఖ్యంగా బిపి రోగులకు ఇది ఒక దివ్యౌషధం లాంటిది. బీపీ రోగులు రోజూ ఒక అరటిపండు తినాలని వైద్యులు సలహా ఇస్తారు. వైద్యులు ఇచ్చిన ఈ చిన్న సలహా అధిక రక్తపోటు రోగుల జీవితాన్ని మార్చగలదు. అయితే బీపీ ఉన్నవారికి అరటిపండు ఎందుకు అంత ప్రత్యేకమైనదో? అరటిపండులో పొటాషియం పుష్కలంగా ఉంటుంది. ఇది సోడియంను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును సహజంగా నియంత్రిస్తుంది. అధిక బీపీకి పొటాషియం సహజ శత్రువు అని వైద్యులు అంటున్నారు. ఒక మధ్య తరహా అరటిపండులో దాదాపు 422ఎస్త్ర పొటాషియం ఉంటుంది. అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ-రీనల్ ఫిజియాలజీలో ప్రచురితమైన ఒక కొత్త అధ్యయనంలో అధిక పొటాషియం తీసుకోవడం అనుకరణ కాలియురేసిస్, నాట్రియురేసిస్, బీపీని గణనీయంగా తగ్గిస్తుందని కనుగొంది. ఎక్కువ సోడియంతో కూడా ప్రయోజనాలను పొందవచ్చు. రక్తపోటు రోగులు తరచుగా బలహీనతను అనుభవిస్తారు. అలాంటి సమయాల్లో అరటిపండు శరీరానికి ఫ్రక్టోజ్, గ్లూకోజ్ వంటి సహజ చక్కెర ద్వారా శక్తిని అందిస్తుంది. అది కూడా ఎటువంటి దుష్ప్రభావాలు లేకుండా. అందుకే దీనిని సూపర్ ఫుడ్ అని పిలుస్తారు. బీపీ రోగులకు ఇది ప్రయోజనకరంగా ఉంటుంది. అరటిపండును ఒక పరిపూర్ణ ఆరోగ్య చిరుతిండిగా పరిగణిస్తారు. అరటిపండు రుచికరమైనది మాత్రమే కాదు తక్కువ కేలరీలు, అధిక పోషకాలు కలిగిన పండు కూడా. మీరు దీన్ని ఉదయం ఎప్పుడైనా తినవచ్చు. స్నాక్స్ సమయంలో లేదా నడక తర్వాత. దీనివల్ల శరీరానికి మంచి శక్తి, పోషకాలు లభిస్తాయి. అరటిపండ్లలో ఉండే విటమిన్ బి6, మెగ్నీషియం రక్త ప్రసరణను మెరుగుపరుస్తాయి. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడతాయి. ప్రతిరోజూ ఒక అరటిపండు తినడం వల్ల మనసు కూడా రిలాక్స్‌గా ఉంటుంది. దీనివల్ల అనేక సమస్యల నుండి ఉపశమనం లభిస్తుంది. అరటిపండులో ఉండే డైటరీ ఫైబర్ రక్తపోటును నియంత్రించడంలో సహాయపడటమే కాకుండా కొలెస్ట్రాల్‌ను సమతుల్యం చేస్తుంది. ఇది మీ గుండె ఆరోగ్యానికి బూస్టర్‌గా కూడా పనిచేస్తుంది.

## సెలబ్రిటీల మెరుపు మీ సొంతం.. గ్లోయింగ్ స్కిన్ కోసం కొన్ని చిట్కాలు


సెలబ్రిటీలలా మెరిసిపోయే చర్మ సౌందర్యం పొందాలని చాలామంది మహిళలు కోరుకుంటారు. అయితే అది కేవలం కొందరికే సాధ్యమని అనుకుంటే పొరపాటే. సరైన జాగ్రత్తలు, కాస్త సమయం కేటాయిస్తే ఎవరైనా సరే సహజమైన, ఆరోగ్యకరమైన గ్లోయింగ్ స్కిన్ పొందవచ్చని సౌందర్య నిపుణులు చెబుతున్నారు. డెర్మటాలజిస్టులు, మేకప్ ఆర్టిస్టులు మెరిసే చర్మం కోసం పాటించాల్సిన కొన్ని ముఖ్యమైన చిట్కాలను పంచుకున్నారు.ఆరోగ్యకరమైన చర్మం కోసం ఒక్కటే మంత్రం అంటూ ఏదీ లేదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. మంచి ఆహారం, తగినంత నిద్ర, ఒత్తిడిని తగ్గించుకోవడం, సరైన స్కిన్‌కేర్ రొటీన్ పాటించడం వంటివి చాలా అవసరం. ముఖ్యంగా కొన్ని అలవాట్లను దినచర్యలో భాగం చేసుకోవడం ద్వారా చర్మంలో స్పష్టమైన మార్పు చూడవచ్చని వారు వివరిస్తున్నారు.

**నిపుణులు సూచిస్తున్న కొన్ని ముఖ్యమైన చిట్కాలు:**

ఎస్పీఎఫ్ తప్పనిసరి: చర్మానికి 90% నష్టం సూర్యరశ్మి వల్లే కలుగుతుంది. అందుకే వాతావరణంతో సంబంధం లేకుండా ప్రతిరోజూ బ్రాడ్ స్పెక్ట్రమ్ ఎస్పీఎఫ్ (స్రాఫీ) 50 ఉన్న సన్‌స్క్రీన్ వాడటం తప్పనిసరి. ఇంట్లో ఉన్నప్పుడు కూడా కిటికీల నుంచి వచ్చే యూవీఏ కిరణాల నుంచి ఇది రక్షణ కల్పిస్తుంది. అసలు ఎస్పీఎఫ్ (స్రాఫీ) అంటే సన్ ప్రొటెక్షన్ ఫ్యాక్టర్. ఇది సూర్యుడి నుంచి వెలువడే హానికరమైన యూవీబీ కిరణాల నుంచి మన చర్మానికి ఎంత రక్షణ లభిస్తుందో సూచిస్తుంది. ఉదాహరణకు, ఎస్పీఎఫ్ 50 రాసుకుంటే, సాధారణం కంటే 50 రెట్లు ఎక్కువ సమయం చర్మం సురక్షితంగా ఉంటుందని అర్థం.తేమ (మాయిశ్చర్) కీలకం: చర్మం పొడిబారినట్లు అనిపిస్తే, హైల్యూరోనిక్ యాసిడ్ ఉన్న సీరమ్ లేదా మాయిశ్చరైజర్ వాడాలి. ఇది నీటిని ఆకర్షించి చర్మాన్ని లోపలి నుంచి తేమగా, కాంతివంతంగా మారుస్తుంది. ఆహారం, వ్యాయామం: ఆహారంలో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండే కూరగాయలు, పండ్లు చేర్చుకోవాలి. అలాగే, రోజూ చేసే వ్యాయామం రక్త ప్రసరణను మెరుగుపరిచి చర్మానికి సహజమైన నిగారింపును ఇస్తుంది. మద్యపానానికి దూరంగా ఉండటం వల్ల చర్మం డీహైడ్రేట్ కాకుండా ఉంటుంది. యాక్టివ్ ఇంగ్రీడియంట్స్: చర్మం నిస్తేజంగా, డల్‌గా కనిపిస్తే రెటినాల్ (విటమిన్ ఎ) వాడకం మేలు చేస్తుంది. ఇది కొత్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహించి చర్మాన్ని తాజాగా మారుస్తుంది. అయితే, దీనిని నిపుణుల సలహా మేరకు తక్కువ మోతాదుతో ప్రారంభించాలి.ఈ చిట్కాలతో పాటు తగినంత నిద్ర, ఒత్తిడిని జయించడం వంటివి పాటిస్తే చర్మం సహజంగానే ఆరోగ్యంగా, కాంతివంతంగా మారుతుందని నిపుణులు భరోసా ఇస్తున్నారు.




## మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే



శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయి పెరిగినప్పుడు అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉంటుంది. ఈ సమస్యలు ముఖ్యంగా ఆర్థరైటిస్, కిడ్నీ సంబంధిత వ్యాధుల రూపంలో కనిపిస్తాయి. అధిక యూరిక్ యాసిడ్ కారణంగా జాయింట్లలో నొప్పులు, వాపులు మొదలవుతాయి. గ్రీన్ కలర్ ఫుడ్స్ దినచర్యలో భాగం చేస్తే ఈ సమస్యను సహజంగా నివారించవచ్చు. పాలకూరలో శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇందులో ఉన్న మెగ్నీషియం శరీరంలో యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ముఖ్యపాత్ర పోషిస్తుంది. పాలకూరను రోజూ తీసుకోవడం వల్ల శరీరానికి పుష్కలమైన పోషకాలు అందించడమే కాక.. ఆరోగ్యాన్ని కాపాడేందుకు సహాయపడుతుంది.పచ్చి బఠానీలలో ఫైబర్ అధికంగా ఉంటుంది.. ఇది శరీరానికి కావలసిన శక్తిని అందిస్తుంది. వీటిలో ఉన్న యాంటీఆక్సిడెంట్లు శరీరాన్ని డిటాక్స్ చేయడంలో తోడ్పడతాయి. గౌట్ వంటి సమస్యలను తగ్గించడానికి ఈ బీన్స్ చాలా ఉపయోగపడతాయి.గ్రీన్ టీ శరీరంలోని హానికరమైన వ్యర్థాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది. ఈ టీలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఆహ్లాదకరమైన రుచి యూరిక్ యాసిడ్ స్థాయిలను తగ్గించడంలో తోడ్పడతాయి. ప్రతిరోజూ ఒక కప్పు గ్రీన్ టీ తాగడం వల్ల మంచి ఫలితాలు పొందవచ్చు. సెలరీలో ఉన్న పోషకాలు మూత్రపిండాల పనితీరును మెరుగుపరుస్తాయి. ఇది శరీరంలోని వాపును తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని సమతుల్యంగా ఉంచడంలో ఈ ఆకుకూర సహాయపడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉంటాయి. ఈ పండు శరీరానికి అవసరమైన ఎనర్జీ అందించే ప్రక్రియను మెరుగుపరుస్తుంది. ఇది శరీరంలోని వ్యర్థ పదార్థాలను వెలుపలికి పంపడంలో సహాయపడుతుంది. యూరిక్ యాసిడ్ స్థాయిని తగ్గించడానికి అవకాడో ఉపయోగపడుతుంది. ఆస్పరాగస్‌లో ఫైబర్, ప్యూరిన్లు సమతుల్యంగా ఉంటాయి. ఇది శరీరంలోని హానికరమైన పదార్థాలను తగ్గించడంలో సహాయపడుతుంది. కాబట్టి ఆస్పరాగస్ ను తగిన మోతాదులో తీసుకోవడం మంచిది.గ్రీన్ బీన్స్ లో ప్యూరిన్లు తక్కువగా ఉంటాయి.. అందుకే ఇవి యూరిక్ యాసిడ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి.

## చీజ్ ఆరోగ్యానికి ఎంత మంచిదంటే..?

చీజ్ తో తయారు చేసే ఆహార పదార్థాలు ఎంతో రుచిగా ఉంటాయి. ఇంకా అలాగే చీజ్ కూడా మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. చీజ్ ను తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం చాలా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు. ఈ చీజ్ ను మితంగా తీసుకోవడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం. చీజ్ లో క్యాల్షియం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలను ధృడంగా ఇంకా ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడుతుంది. చీజ్ ను తీసుకోవడం వల్ల ఎముకలు గుళ్లబారడం ఇంకా ఎముకల పగుళ్లు వంటి సమస్యలు రాకుండా ఉంటాయి.చీజ్ లో ప్రోటీన్ అనేది ఎక్కువగా ఉంటుంది. కండరాలను ఆరోగ్యంగా ఉంచడంలో, దేహ పుష్టికి ప్రోటీన్ అనేది ఎంతో సహాయపడుతుంది. అంతేకాకుండా చీజ్ లో విటమిన్ బి12, విటమిన్ ఎ, ఫాస్పరస్ ఇంకా జింక్ వంటి ఎన్నో పోషకాలు ఉన్నాయి. ఇవి సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించడంలో, శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచడంలో, చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో ఇలా చాలా రకాలుగా సహాయపడతాయి. అలాగే బరువు తగ్గడంలో కూడా చీజ్ మనకు సహాయపడుతుంది. ఈ చీజ్ లో క్యాలరీలు, ప్రోటీన్, కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉన్నప్పటికి దీనిని కొద్ది మోతాదులో తీసుకోగానే కడుపు నిండిన భావన కలుగుతుంది.ఇంకా చీజ్ ను తీసుకోవడం వల్ల త్వరగా ఆకలి వేయకుండా ఉంటుంది. అందువల్ల మనం ఇతర ఆహారాలను తక్కువగా తీసుకుంటాము.ఇంకా అలాగే కొన్ని రకాల చీజ్ లు ప్రోబయాటిక్స్ ను ఎక్కువగా కలిగి ఉంటాయి. ఇవి పొట్ట ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో ఇంకా జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేయడంలో దోహదపడతాయి. ఈ విధంగా చీజ్ మన ఆరోగ్యానికి చాలా మేలు చేస్తుందని దీనిని తగిన మోతాదులో తీసుకోవడం వల్ల మనం సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు.కాబట్టి ఖచ్చితంగా చీజ్ ని తినండి. అనేక ఆరోగ్య ప్రయోజనాలని పొందండి.



# ఇది నా తొలి ఐపీఎల్ సెంచరీ.. జట్టుకు అవసరమైనప్పుడు వచ్చింది: అయ్యర్

**కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అజేయ శతకంతో లక్నోపై పంజాబ్ ఘనవిజయం**

**ఆరు వరుస ఓటముల తర్వాత గెలిచి ప్లేఆఫ్స్ ఆశలు సజీవంగా ఉంచుకున్న పంజాబ్**

**రాజస్థాన్-ముంబై మ్యాచ్ ఫలితంపై పంజాబ్ ప్లేఆఫ్స్ భవితవ్యం**

**అయ్యర్ కెప్టెన్సీ, పరిణతిపై ప్రశంసలు కురిపించిన కోచ్ రికీ పాంటింగ్**





"ఇది నా తొలి ఐపీఎల్ సెంచరీ. జట్టుకు అత్యంత అవసరమైన సమయంలో, గెలవాల్సిన మ్యాచ్‌లో ఇది రావడం మాటల్లో చెప్పలేని ఆనందాన్ని ఇస్తోంది" అని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. ఐపీఎల్ 2026లో భాగంగా లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన కీలక మ్యాచ్‌లో అయ్యర్ (101 నాటౌట్) అద్భుత శతకంతో చెలరేగాడు. దీంతో పంజాబ్ జట్టు 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా ఆరు పరాజయాల తర్వాత ఈ గెలుపు పంజాబ్ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలిపింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందుకున్న అనంతరం అయ్యర్ మాట్లాడుతూ.. "నిజాయతీగా చెప్పాలంటే ఉప్పొంగిపోతున్నాను. ఆరు వరుస ఓటముల తర్వాత మేం చివరికి గెలిచాం. ఇది జట్టులో గొప్ప ఉత్సాహాన్ని నింపింది. రేపు ముంబై ఇండియన్స్‌కు మద్దతు ఇవ్వాలని ఆశిస్తున్నాను" అని వ్యాఖ్యానించాడు. ఈ విజయంతో పంజాబ్ పాయింట్ల పట్టికలో నాలుగో స్థానానికి చేరుకుంది. అయితే, వారి ప్లేఆఫ్స్ భవితవ్యం రాజస్థాన్ రాయల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగే మ్యాచ్ ఫలితంపై ఆధారపడి ఉంది. ఆ మ్యాచ్‌లో రాజస్థాన్ గెలిస్తే పంజాబ్ ఇంటిదారి పడుతుంది. ఒకవేళ ముంబై గెలిస్తే, పంజాబ్‌కు అవకాశం ఉంటుంది. అప్పుడు కూడా కోల్‌కతా నైట్ రైడర్స్ నెట్ రన్ రేటు కీలకం కానుంది. ఒకవేళ అన్నీ అనుకూలిస్తే, బుధవారం న్యూ చండీగఢ్‌లో జరిగే ఎలిమినేటర్ మ్యాచ్‌లో పంజాబ్.. సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడుతుంది. తన బ్యాటింగ్ శైలి గురించి అయ్యర్ వివరిస్తూ.. "ఒక సెంచరీతో మ్యాచ్‌ను ముగించడం అనేది ప్రతి బ్యాట్స్‌మెన్ కల కనే అద్భుతమైన అనుభూతి. ఈ రోజు నేను గొప్ప మానసిక స్థితిలో ఉన్నాను. పిచ్‌ను అంచనా వేయగలిగాను. పరిస్థితులను అర్థం చేసుకుని ఆడటం పరుగులు చేయడానికి సహాయపడింది. ప్రభ్‌సిమ్రాన్‌తో భాగస్వామ్యం చాలా కీలకం. అతడు బౌలర్లపై ఎదురుదాడి చేసిన తీరు అమోఘం. మేమిద్దరం సమన్వయంతో ఆడటం వల్లే విజయం సాధ్యమైంది" అని తెలిపాడు. వరుస ఓటముల తర్వాత జట్టును ఎలా తిరిగి గాడిన పెట్టారనే ప్రశ్నకు.. "మేం పెద్దగా చర్చించుకోలేదు. సమావేశాలు పెట్టి ఆటగాళ్లపై మరింత ఒత్తిడి పెంచడం కన్నా వారిని స్వేచ్ఛగా వదిలేయడమే మంచిదని భావించాం. కీలక మ్యాచ్‌లలో ఆటగాళ్లు స్వేచ్ఛగా ఆడటం ముఖ్యం. కోచ్ రికీకి కూడా ఇదే చెప్పాను. ఈ రోజు దాని ఫలితం చూశాం" అని అయ్యర్ వివరించాడు. బౌలర్లు కూడా అద్భుతంగా పుంజుకున్నారని, ముఖ్యంగా యుజ్వేంద్ర చాహల్ కీలకమైన రిషభ్ పంత్ వికెట్ తీసి మ్యాచ్‌ను మలుపు తిప్పాడని ప్రశంసించాడు. మరోవైపు కోచ్ రికీ పాంటింగ్.. అయ్యర్ పరిణతి చెందిన నాయకత్వాన్ని కొనియాడాడు. "వేలంలో అయ్యర్ కోసం అంత డబ్బు ఎందుకు ఖర్చు చేశానో ఈ రోజు అతడు నిరూపించాడు. అతడు ఒక అద్భుతమైన ఆటగాడు, పరిణతి చెందిన నాయకుడు. భారత టీ20 జట్టులో కూడా అతడికి ఉజ్వల భవిష్యత్తు ఉంది" అని పాంటింగ్ అన్నారు. ఇక ఈ ఓటమితో లక్నో సూపర్ జెయింట్స్ ఈ సీజన్‌లో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానంలో నిలిచి టోర్నీ నుంచి నిష్క్రమించింది. కెప్టెన్ రిషభ్ పంత్ మాట్లాడుతూ.. "ఇది చాలా కఠినమైన సీజన్. ఈ టోటల్ కాపాడుకోవాల్సిందే, కానీ ఏకనా స్టేడియంలో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ సులభం అవుతుంది. వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి వస్తాం" అని పేర్కొన్నాడు.

# శ్రేయస్ సంచలన బ్యాటింగ్... పంజాబ్ గెలిచింది, రేసులో నిలిచింది!

**కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అజేయ సెంచరీతో పంజాబ్ ఘన విజయం**

**ప్లేఆఫ్స్ రేసులో తమ ఆశలను సజీవంగా నిలుపుకున్న పంజాబ్ కింగ్స్**

**ప్రభ్‌సిమ్రాన్‌తో కలిసి అయ్యర్ 140 పరుగుల కీలక భాగస్వామ్యం**

**ఈ ఓటమితో పాయింట్ల పట్టికలో అట్టడుగు స్థానానికి పరిమితమైన లక్నో**

**సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించి, శతకాన్ని పూర్తి చేసుకున్న శ్రేయాస్**

ఐపీఎల్ 2026 సీజన్‌లో పంజాబ్ కింగ్స్ తమ ప్లేఆఫ్స్ ఆశలను సజీవంగా నిలుపుకుంది. తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (51 బంతుల్లో 101 నాటౌట్; 11 ఫోర్లు, 5 సిక్సర్లు) వీరోచిత సెంచరీతో ముందుండి నడిపించాడు. లక్నోలోని ఏకానా క్రికెట్ స్టేడియంలో శనివారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ కింగ్స్ 7 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్‌పై ఘన విజయం సాధించింది. 197 పరుగుల టార్గెట్ ను మరో రెండు ఓవర్లు మిగిలుండగానే ఛేదించింది. 18 ఓవర్లలో 3 వికెట్లకు 200 పరుగులు చేసి విజయభేరి మోగించింది. అయ్యర్ తన తొలి ఐపీఎల్ సెంచరీని నమోదు చేయడంతో పాటు, జట్టుకు మరపురాని విజయాన్ని అందించాడు. ఈ ఓటమితో లక్నో ఈ సీజన్‌లో పాయింట్ల పట్టికలో చివరి స్థానంలో నిలవడం ఖాయమైంది. 197 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన పంజాబ్ కింగ్స్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఇన్నింగ్స్ మొదటి బంతికే ప్రియాన్ష్ ఆర్య (0) ఔట్ కాగా, కాసేపటికే కూపర్ కనోలీ (18) కూడా పెవిలియన్ చేరాడు. దీంతో పంజాబ్ 22 పరుగులకే 2 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో క్రీజులోకి వచ్చిన కెప్టెన్ శ్రేయస్ అయ్యర్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్ (39 బంతుల్లో 69; 7 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. వీరిద్దరూ సంయమనంతో ఆడుతూనే, వీలు చిక్కినప్పుడల్లా బౌండరీలు బాదారు. ఈ క్రమంలో మూడో వికెట్‌కు 140 పరుగుల భారీ భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను పంజాబ్ వైపు తిప్పారు. విజయం దిశగా సాగుతున్న దశలో ప్రభ్‌సిమ్రాన్ ఔటయ్యాడు. అప్పటికి పంజాబ్ విజయానికి 35 పరుగులు అవసరం కాగా, శ్రేయస్ అయ్యర్ పూర్తి బాధ్యత తీసుకున్నాడు. గేర్లు మార్చి దూకుడుగా ఆడిన అతను, మహ్మద్ షమీ వేసిన ఓవర్లో మూడు సిక్సర్లు బాది మ్యాచ్‌ను లాగేశాడు. చివరికి మరో భారీ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించడమే కాకుండా, తన కెరీర్‌లో తొలి ఐపీఎల్ సెంచరీని స్టైల్‌గా పూర్తి చేసుకున్నాడు. ఒత్తిడిలో ఒక కెప్టెన్‌గా అతను ఆడిన తీరు అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంది. అంతకుముందు టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్ జెయింట్స్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. జాష్ ఇంగ్లిస్ (72), ఆయుష్ బదోని (43) రాణించడంతో లక్నో పోరాడగలిగే స్కోరును సాధించింది. అయితే, కేవలం ఐదుగురు రెగ్యులర్ బౌలర్లతో బరిలోకి దిగిన లక్నో, బౌలింగ్‌లో వైఫల్యం చెంది ఈ స్కోరును కాపాడుకోలేకపోయింది. కీలక సమయంలో వికెట్లు తీయలేకపోవడం, అయ్యర్ దూకుడును అడ్డుకోలేకపోవడం లక్నో ఓటమికి ప్రధాన కారణాలుగా నిలిచాయి.



## టీ20 తరహా క్రికెట్... తెలంగాణలో టీజీ20 లీగ్

**ఎనిమిది జట్లను ఏర్పాటు చేసిన హెచ్‌సీఏ**

**జూన్ 20న తొలి మ్యాచ్, జూలై 11న ఫైనల్ మ్యాచ్**

**హైదరాబాద్ జట్టును రూ.7.5 కోట్లకు కొనుగోలు చేసిన ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్**

**జూన్ 7న ఆటగాళ్ల వేలం**



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) టీజీ20 క్రికెట్ లీగ్‌కు శ్రీకారం చుట్టింది. టీ20 తరహాలో క్రికెట్ లీగ్‌కు హెచ్‌సీఏ సిద్ధమైంది. టీజీ20 క్రికెట్ లీగ్ కోసం ఎనిమిది జట్లను ఏర్పాటు చేశారు. ఈ మ్యాచ్‌ల కోసం షెడ్యూల్ కూడా విడుదలైంది. జూన్ 20వ తేదీన తొలి మ్యాచ్, జూలై 11న ఫైనల్ మ్యాచ్ ఉంటాయి. హైదరాబాద్, రంగారెడ్డి, వరంగల్, మెదక్, నల్గొండ, కరీంనగర్, మహబూబ్ నగర్, ఖమ్మం జట్లు ఉన్నాయి. ఆయా జట్లను వివిధ సంస్థలు సొంతం చేసుకున్నాయి. హైదరాబాద్ జట్టును రూ.7.5 కోట్లకు ఉషోదయ ఎంటర్‌ప్రైజెస్ లిమిటెడ్, రంగారెడ్డిని రూ.7.2 కోట్లకు బూరుగు ఇన్ఫ్రా ప్రణవ, వరంగల్‌ను రూ.6.55 కోట్లకు బైన్ గ్లోబల్ రిసోర్సెస్, మెదక్‌ను రూ.6.33 కోట్లకు బృందా ఇన్ఫ్రా ప్రైవేట్ లిమిటెడ్, నల్గొండను రూ.5.06 కోట్లకు కిశోర్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, కరీంనగర్‌ను రూ.4.57 కోట్లకు ఈఐపీఎల్ గ్రూప్ (తిబరుమల్), మహబూబ్ నగర్‌ను రూ.4.5 కోట్లకు వీరభద్ర స్టీల్స్, ఖమ్మం జట్టును రూ.4.44 కోట్లకు అన్విత గ్రూప్ సొంతం చేసుకున్నాయి. కాగా, ఈ ఫ్రాంచైజీల కోసం ఆటగాళ్ల వేలం ప్రక్రియను జూన్ 7న నిర్వహించనున్నారు.

## 17 ఏళ్లకే అంపైర్‌గా అరంగేట్రం... క్రికెట్ కుటుంబం నుంచి కొత్త తరం!

**కేరళలో 17 ఏళ్ల నమ్రతా వినోద్ క్రికెట్ అంపైర్‌గా అరంగేట్రం**

**రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించి మ్యాచ్ అఫిషియేట్‌గా అర్హత**

**తల్లి, అత్త కూడా కేరళ తరఫున ఆడిన మాజీ క్రికెటర్లు**

**టెన్షన్ లేదని, ప్రశాంతంగా ఉండటమే ఇష్టమని చెప్పిన నమ్రత**

కేరళలోని త్రిస్సూర్ ఆత్రేయ క్రికెట్ గ్రౌండ్‌లో ఆదివారం ఉదయం జరిగేది కేవలం ఓ సాధారణ మ్యాచ్ కాదు. అది 17 ఏళ్ల నమ్రతా వినోద్ జీవితంలో ఒక కొత్త అధ్యాయానికి నాంది. అంపైరింగ్ రాత పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఆమె, ఈ మ్యాచ్‌తో అధికారికంగా అంపైర్‌గా తన ప్రయాణాన్ని ప్రారంభించబోతోంది. త్రిచూర్, పాలక్కాడ్ జిల్లాల క్రికెట్ అసోసియేషన్ కమిటీల మధ్య జరిగే ఈ మ్యాచ్‌కు ఆమె అంపైర్‌గా వ్యవహరించనుంది. నమ్రత కుటుంబానికి క్రికెట్‌తో విడదీయరాని బంధం ఉంది. ఆమె తల్లి నికేత కేరళ మాజీ మహిళా క్రికెటర్, సెలక్షన్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా కూడా పనిచేశారు. అలాగే, నమ్రత అత్త (తండ్రి సోదరి) విలాసిని నాయర్ కూడా కేరళకు ప్రాతినిధ్యం వహించి, ప్రస్తుతం సదరన్ రైల్వే కోచ్‌గా ఉన్నారు. ఇంతటి క్రికెట్ నేపథ్యం ఉన్నప్పటికీ, నమ్రత ఎలాంటి ఒత్తిడి లేకుండా ఎంతో ధీమాగా కనిపిస్తోంది. "ఇందులో పెద్ద విషయమేముంది? టెన్షన్ పడితే పనులు మరింత క్లిష్టంగా మారతాయి. అందుకే నేను ప్రశాంతంగా ఉండటానికే ఇష్టపడతాను" అని నమ్రత నవ్వుతూ చెప్పింది. అయితే, ఆమె తల్లి నికేత మాత్రం కాస్త ఉత్కంఠగా ఉన్నట్లు తెలిపారు. "ఒక క్రికెట్ మ్యాచ్‌లో ఎలాంటి పరిస్థితులు ఉంటాయో నాకు తెలుసు కాబట్టి కొంచెం టెన్షన్‌గా ఉంది. కానీ, నమ్రత ధైర్యంగా ఉండటం సంతోషాన్నిస్తోంది" అని ఆమె అన్నారు. చిన్నప్పటి నుంచి గాయనిగా, డ్యాన్సర్‌గా ఎన్నో వేదికలెక్కిన నమ్రత, ఇప్పుడు క్రికెట్ మైదానంలో తనదైన ముద్ర వేయడానికి సిద్ధమవుతోంది.



మన దునియా
RNI Number TTT TTT /2023/85680
మన అక్షరం - మన ప్రపంచం

## జిమ్‌లో శ్రియా రెడ్డి 'కర్రసాము' విన్యాసాలు..



### కాలికి గాయమైనా జిమ్‌లో శ్రియా రెడ్డి కసరత్తులు

### సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన 'కర్రసాము' వీడియోలు

### ఆమె ఫిట్‌నెస్‌పై నెటిజన్ల ఆశ్చర్యం

నటి శ్రియా రెడ్డి తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా షేర్ చేసిన కొన్ని వీడియోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కాలికి గాయమై కట్టు కట్టి ఉన్నప్పటికీ ఆమె జిమ్‌లో కఠినమైన కసరత్తులు చేస్తూ కనిపించారు. కేవలం వర్కవుట్లు మాత్రమే కాకుండా ఆమె చేసిన కర్రసాము విన్యాసాలు అందరినీ ఆశ్చర్యపరుస్తున్నాయి.

ఒంటి చేత్తో విన్యాసాలు

శ్రియా రెడ్డి మొత్తం మూడు వీడియోలను అభిమానులతో పంచుకున్నారు. మొదటి దాంట్లో ఒంటి చేత్తో కర్రను గిరగిరా తిప్పుతూ అదరగొట్టారు. రెండో వీడియోలో రెండు చేతులతో రెండు కర్రలను చాలా వేగంగా తిప్పుతూ తన నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇక మూడో దాంట్లో జిమ్‌లో కఠినమైన వర్కవుట్లు చేస్తూ కనిపించారు. ఆమె ఫిట్‌నెస్ పట్ల నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

హనుమాన్ కాంప్లెక్స్ మెసేజ్

ఈ వీడియోలతో పాటు శ్రియా రెడ్డి పెట్టిన పోస్ట్ నెటిజన్లను ఆలోచింపజేస్తోంది. "మళ్లీ ఫామ్‌లోకి రావడానికి ఒక్కో అడుగు వేస్తున్నా. మన బలాన్ని మనం మర్చిపోవడాన్నే 'హనుమాన్ కాంప్లెక్స్' అంటారు. జీవితం తిరిగి గుర్తుచేసే వరకు మన శక్తి ఏంటో మనకు తెలియదు. సముద్రాన్ని దాటే ముందు హనుమంతుడికి కూడా జాంబవంతుడు ఆయన శక్తిని గుర్తుచేయాల్సి వచ్చింది. మనల్ని మనం నమ్మడానికి కొన్నిసార్లు మనకూ ఒకరు కావాలి" అని ఆమె రాసుకొచ్చారు.


## ఆ సమయంలో చాలా సిగ్గుగా అనిపించింది: నాగార్జున

### ఐదో తరగతి చదువుతున్నప్పుడు డ్రామాలో ఆడవేషం వేయించారన్న నాగార్జున

### అందరూ ఎగతాళి చేయడంతో సిగ్గనిపించిందని వెల్లడి

### సినిమాల్లో నటించమని తన అన్నయ్య సూచన చేశాడన్న నాగార్జున

తాను ఐదో తరగతి చదువుతున్నప్పుడు ఒక డ్రామాలో ఆడవేషం వేయించారని, అప్పుడు అందరూ తనను చాలా ఎగతాళి చేశారని ప్రముఖ సినీ నటుడు నాగార్జున అన్నారు. ఆ సమయంలో తనకు చాలా సిగ్గుగా అనిపించిందని పేర్కొన్నారు. నాగార్జున సినిమా పరిశ్రమకు వచ్చి 40 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయన తన సినీ ప్రయాణం గురించి చెప్పుకొచ్చారు. తాను నటుడిని అవుతాననే చెప్పే ఆనవాళ్లు తన బాల్యంలో ఏవీ లేవని అన్నారు.తనకు మూడు సంవత్సరాలు ఉన్నప్పుడే హైదరాబాద్‌కు వచ్చేశామని తెలిపారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్లో చదివానని, కానీ స్టార్ హీరో నాగేశ్వరరావు కొడుకును అనే ప్రత్యేక శ్రద్ధ ఏమీ ఉండేది కాదని అన్నారు. తాను సగటు విద్యార్థిని అని, చదువులో మొదటి ఇరవై స్థానాల్లో ఉండేవాడినని అన్నారు. ఆడవేషం వేసినప్పుడు తనను ఎగతాళి చేయడంతో తాను మళ్లీ డ్రామాల జోలికి వెళ్లలేదని పేర్కొన్నారు.సుడిగుండాలు చిత్రంలో 30 సెకన్లు మాత్రమే కనిపించే చిన్న పాత్ర వేశానని, తాను మేకప్ వేసుకోవడం అదే మొదటిసారి అన్నారు. చదువు పూర్తయ్యాక ఏడాదిన్నర పాటు అమెరికాలో ఉన్నానని అన్నారు. అక్కడే సెటిల్ అవుదామని ఎప్పుడూ అనుకోలేదని వెల్లడించారు. ఇక్కడకు వచ్చి ఏదైనా వ్యాపారం చేద్దామనుకున్నానని, అప్పుడు ఏదైనా లైసెన్స్ కావాలంటే ఏడాది సమయం పట్టేదని అన్నారు.అందుకే తాను ఫిల్మ్ ప్రొడక్షన్‌లోకి దిగానని చెప్పారు. అప్పుడే తన అన్నయ్య వెంకట్, తనను సినిమాల్లో నటించమని సూచించాడని పేర్కొన్నారు. అప్పటి వరకు తనకు నటన మీద ఆసక్తి లేదని, కానీ అన్నయ్య చెప్పాక ఆలోచించానని తెలిపారు. 1986లో మొదటి చిత్రం 'విక్రమ్' విడుదలైందని, అది మంచి విజయం సాధించినప్పటికీ విమర్శలు వచ్చాయని అన్నారు. తనను నాన్న గారితో పోల్చి చూడటంతో విమర్శలు వచ్చాయని అన్నారు. సినిమాల్లో జీన్స్ వేసుకోవడం తనతోనే ప్రారంభమైందని గుర్తు చేసుకున్నారు.





## ఆ వైరల్ వీడియో, ఫొటోలు నావి కావు.. బాధ్యులపై లీగల్ యాక్షన్ తీసుకుంటా: రుక్మిణి వసంత్

### అవి ఏఐ టెక్నాలజీతో సృష్టించిన ఫేక్ చిత్రాలని ఇన్స్టాగ్రామ్ స్టోరీలో వెల్లడి

### ఇది వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగించడమేనని, బాధ్యులపై లీగల్ చర్యలు తీసుకుంటామని హెచ్చరిక

### ఇలాంటి తప్పుడు కంటెంట్‌ను షేర్ చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి

### యశ్‌తో 'టాక్సిక్', జూనియర్ ఎన్టీఆర్‌తో 'డ్రాగన్' సినిమాల్లో నటిస్తున్న రుక్మిణి

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన బికినీ ఫోటోషూట్ చిత్రాలపై నటి రుక్మిణి వసంత్ తీవ్రంగా స్పందించారు. ఆ చిత్రాలు పూర్తిగా నకిలీవని, ఏఐ టెక్నాలజీతో సృష్టించినవని ఆమె స్పష్టం చేశారు. ఈ వ్యవహారంపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరించారు.కొన్ని రోజులుగా, గ్రీన్ బికినీ ధరించి స్విమ్మింగ్ పూల్‌లోకి వెళుతున్నట్లుగా ఉన్న ఓ మహిళ ఫొటోలు, వీడియో క్లిప్‌లు ఆన్‌లైన్‌లో విపరీతంగా చక్కర్లు కొడుతున్నాయి. చాలామంది నెటిజన్లు ఇది రుక్మిణి వసంత్ 'మొదటి బికినీ షూట్' అంటూ ప్రచారం చేయడంతో గందరగోళం నెలకొంది. ఈ నేపథ్యంలో రుక్మిణి తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీ ద్వారా దీనిపై పూర్తి వివరణ ఇచ్చారు."నా పేరుతో సర్క్యులేట్ అవుతున్న కొన్ని ఏఐ-జనరేటెడ్ చిత్రాలు నా బృందం దృష్టికి వచ్చాయి. ఆ చిత్రాలు పూర్తిగా ఫేక్, కల్పితం అని నేను స్పష్టంగా చెప్పాలనుకుంటున్నాను. వాటికి నాకు ఎలాంటి సంబంధం లేదు" అని ఆమె తన పోస్టులో పేర్కొన్నారు. ఇలాంటి నకిలీ కంటెంట్‌ను సృష్టించి, వ్యాప్తి చేయడం అత్యంత బాధ్యతారాహిత్యమని, ఇది వ్యక్తిగత గోప్యతా హక్కులను తీవ్రంగా ఉల్లంఘించడమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.ఈ ఫేక్ చిత్రాలను రూపొందించి, వ్యాప్తి చేసిన వారిపై తన బృందం సైబర్ క్రైమ్, చట్టపరమైన చర్యలు ప్రారంభిస్తుందని రుక్మిణి తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ప్రోత్సహించవద్దని, ఆ కంటెంట్‌ను ఎవరూ షేర్ చేయవద్దని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ వివాదం పక్కన పెడితే, రుక్మిణి వసంత్ తన కెరీర్‌పై పూర్తి దృష్టి సారించారు. ఆమె ప్రస్తుతం పాన్ ఇండియా స్టార్ యశ్‌తో కలిసి 'టాక్సిక్' చిత్రంలో నటిస్తున్నారు. దీనితో పాటు యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్ హీరోగా చేస్తున్న 'డ్రాగన్' సినిమాలో కూడా ఆమె హీరోయిన్. ఇలా కెరీర్‌లో ప్రస్తుతం ఆమె వరుస పాన్ ఇండియా ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AAKULA SUDHAKAR, PUSHPALATHA PUBLICATIONS AND PRINTING, HNo: 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST - 506349, TELANGANA STATE, PUBLISHED PUSHPALATHA PUBLICATIONS HNo. 1-83, B.C.Colony, BOLLONIPALLY ARSHANPALLY, NALLABELLY MANDALAM, WARANGAL DIST- 506349.TELANGANA STATE,TITEL-code : RNI NUMBER ; TELTEL-2023/85680, Cell No: 9603969335, MANADUNIA 2022 @ gmail.com